ప్రజాశక్తి

సోమవారం 6 జనవరి 2025

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

ఉక్కు నిరసనలు

స్టీల్‌ప్లాంట్‌పై ప్రధాని ప్రకటన చేయాలని నిర్వాసిత కాలనీల్లో పాదయాత్రలు

వడ్లపూడిలో నిరసన తెలుపుతున్న నాయకులు

ప్రజాశక్తి - ఉక్కునగరం, గాజువాక విలేకరులు

విశాఖలో ఆదివారం ఉక్కు నిరసనలు హోరెత్తాయి. ఈ నెల 8న విశాఖ పర్యటనకు వస్తున్న ప్రధాని మోడీ వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఇవి సాగాయి. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్ సహా ఉక్కు నిర్వాసిత కాలనీలన్నింటా కార్మికులు పాదయాత్రలు నిర్వహించారు.

ఉక్కునగరం రైతు బజార్ వద్ద తలపెట్టిన కార్యక్రమంలో జివిఎంసి 78వ వార్డు సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ నిర్వీర్యానికి కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కుట్రలను తీవ్రతరం చేస్తోందన్నారు. ఈ క్రమంలోనే ఉక్కు యాజమాన్యం కార్మికులకు వేతనాలు చెల్లించకుండా ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. ప్లాంట్‌ను కాపాడాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు వైటి.దాస్, డొక్కా నర్సింగరావు, వి.ప్రసాద్, పుల్లారావు, మహేష్, రాథోడ్, దుర్గా ప్రసాద్,

పెదగంట్యాడలో పాదయాత్ర చేస్తున్న నాయకులు, కార్మికులు

బిఎన్.మధుసూదన్, కృష్ణమూర్తి, కార్మికులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వడ్లపూడిలో..

స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలంటూ జివిఎంసి 87వ వార్డు వడ్లపూడి నిర్వాసిత కాలనీలో పాదయాత్ర చేపట్టారు. పోరాట కమిటీ నాయకులు జె.అయోధ్య రామ్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి, 87వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్ పాల్గొని ఉక్కు కర్మాగార విశిష్టతను తెలియజేశారు. పోరాటాలతో ప్లాంట్‌ను కాపాడుకుంటామన్నారు. కార్యక్రమంలో మిగతా 2లో..

మంత్రి లోకేష్‌కు ఏర్పాట్ల వివరాలు తెలుపుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

సమన్వయంతో వ్యవహరించండి

◆ ప్రధాని పర్యటన ఏర్పాట్లపై సమీక్షలో మంత్రి నారా లోకేష్

◆ ఎయులో పనుల పరిశీలన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ : ఈ నెల 8న విశాఖలో ప్రధాని మోడీ పర్యటనను విజయవంతం చేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో వ్యవహరించాలని రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. ఈ అంశాన్నే సింగిల్ అజెండాగా పెట్టుకొని అహర్నిశలూ శ్రమించాలని సూచించారు. ఎయు ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో జరిగే ప్రధాని బహిరంగ సభ, రోడ్ షో ఏర్పాట్లపై ఆయన ఉత్తరాంధ్ర జిల్లాల అధికారులు, రాష్ట్ర మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, వంగలపూడి అనిత, గుమ్మడి సంధ్యారాణి, కొండపల్లి శ్రీనివాసు, కొల్లు రవీంద్ర, ప్రభుత్వ విప్‌లు గణబాబు, వేపాడ చిరంజీవిరావు తదితరులతో ఆదివారం ఉదయం కలెక్టరేట్ మీటింగు హాలులో సమీక్ష జరిపారు. అనంతరం ఎయు మైదానంలో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్, సిపి శంఖబ్రత బాగ్చీ ఏర్పాట్లు తీరును లోకేష్‌కు వివరించారు. అనంతరం లోకేష్ మీడియాతో మాట్లాడుతూ రోడ్‌షో బాధ్యతలు మిగతా 2లో..

నేడు ప్రజా సమస్యల ఫిర్యాదుల వేదిక రద్దు

▶ వార్త 2లో..

స్టీల్‌ప్లాంట్ రక్షణకు 7న వామపక్షాల ధర్నా

▶ వార్త 2లో..

చిరుద్యోగుల వెతలు పట్టవా ?

▶ వార్త 2లో..

మీడియాతో మాట్లాడుతున్న మంత్రి అనిత

విశాఖ కేంద్ర కారాగార ప్రక్షాళన

హోం మంత్రి అనిత వార్త మెయిన్‌లో..

టెన్త్‌లో శత శాతం ఉత్తీర్ణతకు కృషి

◆ అన్ని పాఠశాలల్లో సిలబస్ పూర్తి

◆ 'ప్రజాశక్తి'తో అనకాపల్లి జిల్లా విద్యా శాఖాధికారి అప్పారావు నాయుడు

ప్రజాశక్తి - అనకాపల్లి : ఈ ఏడాది మార్చి 18 నుంచి ఏప్రిల్ 1 వరకూ జరిగే పదో తరగతి పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేస్తున్నామని అనకాపల్లి జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావు నాయుడు తెలిపారు. లక్ష్యాన్ని చేరుకునేందుకు జిల్లాలో తీసుకుంటున్న చర్యలను ఆయన 'ప్రజాశక్తి'కి వెల్లడించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

జిల్లాలో పదో తరగతి పరీక్షలకు ఎంత మంది హాజరుకానున్నారు ?

జిల్లాలో మొత్తం 412 పాఠశాలలు ఉన్నాయి. వీటిలో జిల్లా పరిషత్ పాఠశాలలు 203, కెజిబివి 20, మోడల్ స్కూళ్లు 5, గవర్నమెంట్ స్కూళ్లు 11, మినీ గురుకుల వసతి గృహాలు 11, ఎయిడెడ్ పాఠశాల 1, ప్రైవేటు పాఠశాలలు 161 ఉన్నాయి. ప్రస్తుతం అన్ని పాఠశాలల్లో సిలబస్ పూర్తయింది. జిల్లాలో మొత్తం 22002 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరవుతుండగా, వీరిలో బాలురు 11200 మంది, బాలికలు 10802 మంది ఉన్నారు.

శత శాతం ఉత్తీర్ణతకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు ?

జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో పదో

తరగతిలో శత శాతం ఉత్తీర్ణతకు చర్యలు చేపడుతున్నాం. ముఖ్యంగా వంద రోజుల యాక్షన్ ప్లాన్, ఫోర్ మెంబర్స్ కమిటీ

ఆధ్వర్యంలో ప్రతి వారం పదో తరగతి పరీక్షలపై ప్రత్యేక సమీక్షను కలెక్టర్ నిర్వహిస్తున్నారు. పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్స్, అదనపు ఉపాధ్యాయులను మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

ఉక్కు నిరసనలు

నాయకులు ఆదినారాయణ, రాజన్ రాజు, విజయరామరాజు, కడుపుట్ల శ్రీను, చక్రవర్తి, శ్రీధర్, వేణుబాబు తదితరులు పాల్గొన్నారు.

అగనంపూడిలో..

అగనంపూడి పరిసర ప్రాంతాల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. అగనంపూడి, డొంకాడ, కొండయ్య వలస, దిబ్బపాలెం తదితర ప్రాంతాల్లో ఈ ర్యాలీ సాగింది. ఉక్కు రక్షణ నినాదాలు ఆ ప్రాంతాల్లో మార్మోగాయి.

పెదగంట్యాడలో..

పెదగంట్యాడ నిర్వాసిత కాలనీల్లో జరిగిన పాదయాత్రలో పోరాట కమిటీ నాయకులు యు.రామస్వామి, మంత్రి రాజశేఖర్, పులి రమణారెడ్డి, మహేశ్వర రెడ్డి, వై.శ్రీనివాసరావు, ఆదినారాయణ, బొడ్డు పైడిరాజు, ప్రభాకర్ రెడ్డి, ఎల్లేటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉక్కు రక్షణ కోసం సోమవారం జరిగే చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పెదగంట్యాడ కూడలి నుంచి ప్రారంభమైన ఈ పాదయాత్ర నెల్లిముక్కు, బాలచెరువు మీదుగా నడుపూరు వరకూ సాగింది.

టెన్త్‌లో శత శాతం ఉత్తీర్ణతకు కృషి

ఏర్పాటు చేస్తున్నాం. ఉదయం గంట, సాయంత్రం గంట అదనపు తరగతులు తీసుకుంటున్నాం.

స్టడీ మెటీరియల్ అందించారా ?

జిల్లాలో అన్ని పాఠశాలలకు డిస్ట్రిక్ట్ కామన్ ఎగ్జామినేషన్ అందించిన స్టడీ మెటీరియల్ అందించాం. ఈ ఏడాది శతశాతం ఉత్తీర్ణత సాధించేందుకు అన్ని విధాలా కృషి చేస్తున్నాం.

విద్యార్థులకు ఎటువంటి సదుపాయాలు కల్పిస్తున్నారు ?

అన్ని పరీక్షా కేంద్రాల్లో విద్యుత్తు సదుపాయంతో పాటు మంచినీటి సదుపాయం, ప్రాథమిక చికిత్సకు అవసరమైన ఏర్పాట్లు చేసాం.

సమన్వయంతో వ్యవహరించండి

గణబాబు, బహిరంగ సభ బాధ్యతలు పల్లా శ్రీనివాసరావు తీసుకోవాలని నిర్ణయించామని వెల్లడించారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వచ్చే ప్రజలకు రవాణా, తాగునీటి వసతి, పార్కింగ్ సదుపాయంపై పలు సూచనలు చేశారు. సిరిపురంలోని వెంకటాద్రి వంటిల్లు నుంచి ఎయు ఇంజినీరింగ్ కళాశాల ప్రధాన మైదానం వరకు ప్రధాని మోడీ రోడ్ షో ఉంటుందని, ప్రజలకు అభివాదం చేస్తూ ఆయన సభా వేదికకు చేరుకుంటారని తెలిపారు. ప్రజలు ప్రధానికి చేరువుగా ఉండేలా బారికేడింగ్ ఏర్పాట్లు చేయాలని, డబుల్ బారికేడింగ్ కాకుండా సింగిల్ బారికేడింగ్ విధానానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రధానితో పాటు, రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి రోడ్ షోలో పాల్గొంటారన్నారు. వివిఐపి, విఐపి వాహనాల పార్కింగ్, ప్రజల వాహనాల పార్కింగ్‌కు 26 ప్రాంతాల్లో ఏర్పాట్లు చేసినట్టు అధికారులు మంత్రికి తెలిపారు. పాస్‌ల జారీకి ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. లోకేష్ వెంట రాష్ట్ర మంత్రులు, పలువురు ప్రజాప్రతినిధులు ఉన్నారు.

ఐటి రంగానికి విశాఖ రాజధాని

విశాఖను ఐటి రాజధానిగా చేస్తామని మంత్రి నారా లోకేష్ చెప్పారు. ఆదివారం కలెక్టరేట్‌లో జరిగిన మంత్రులు, అధికారుల సమావేశం అనంతరం పోర్టుకో వద్ద మీడియాతో ఆయన మాట్లాడుతూ విశాఖకు అనేక పరిశ్రమలు రానున్నాయని చెప్పారు. రెండు మాసాల్లో విశాఖలో టిసిఎస్ కార్యకలాపాలు ప్రారంభమవుతాయని తెలిపారు. భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు నిర్మాణాన్ని గతంలో తమ ప్రభుత్వం ఉన్నప్పుడు ప్రారంభించిందని, ఇప్పుడు తమ ప్రభుత్వం ఉండగానే అది పూర్తవుతుందని అన్నారు. ఒకే రాష్ట్రం, ఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణ తమ నినాదమన్నారు. ఈ నెల 8న విశాఖపట్నం వస్తున్న ప్రధాని మోడీ ఎన్‌టిపిసి గ్రీన్ హైడ్రోజన్ హబ్, బల్క్ డ్రగ్ పార్క్, రైల్వే జోన్‌కు శంకుస్థాపన చేస్తారని చెప్పారు. రూ.5 వేల కొత్త ప్రాజెక్టులతో పాటు ఇప్పటికే పూర్తయిన ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు ఉంటాయన్నారు. వాల్తేర్ డివిజన్ విశాఖ రైల్వే జోన్‌లో కలిసి ఉంటుందా ? అనే ప్రశ్నకు బదులిస్తూ వాల్తేరు డివిజన్ ఇటు ఎపి, అటు ఒడిశా రాష్ట్రాలకు ముడిపడి ఉందని, ఆ సమస్యను రెండు రాష్ట్రాలు పరిష్కరించుకుంటాయని చెప్పారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి దించిందని ఆరోపించారు. ప్రస్తుతం నెలకు రూ.4 వేల కోట్లు లోటుతో రాష్ట్రం ఉందని, కేంద్రం సహకారంతో ముందుకు వెళుతున్నామని చెప్పారు. పంచ గ్రామాల సమస్యపై ముఖ్యమంత్రి టైం బాండ్ ఇచ్చారని, త్వరలోనే సమస్య పరిష్కారమవుతుందని మరొక ప్రశ్నకు బదులిచ్చారు. గత ప్రభుత్వ విధ్వంసంతో పారిశ్రామికవేత్తలు భయభ్రాంతులకు గురయ్యారన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు ఎపికి వచ్చేందుకు భయపడుతున్నారని తెలిపారు. గంజాయి కేసులు అధికంగా వస్తున్నాయని ప్రశ్నించగా నిర్మూలనకు గట్టి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రుషికొండ ప్యాలెస్‌ను ఏం చేస్తారని అడగ్గా.. దానిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదన్నారు. ఒక వ్యక్తి నివసించడం కోసం రూ.500 కోట్లతో దానిని నిర్మించారని, పర్యావరణానికి వ్యతిరేకంగా కట్టడం వల్ల రూ.300 కోట్లు జరిమానాను ఇప్పుడు చెల్లించాల్సి ఉందని తెలిపారు. గతంలో ఇక్కడ ఉన్న భవనాలను కూల్చడం వల్ల సుమారు రూ.200 కోట్లు నష్టం వచ్చిందని, ఇవన్నీ కలిపితే మొత్తం రూ.వెయ్యి కోట్లు నష్టం జరిగిందని చెప్పారు.

నేడు ప్రజా సమస్యల ఫిర్యాదుల వేదిక రద్దు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల ఫిర్యాదుల వేదిక కార్యక్రమాన్ని ఈ సోమవారం రద్దు చేసినట్టు జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 8న ప్రధాని నరేంద్ర మోడీ విశాఖపట్నం వస్తున్న సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం లేదని, దీన్ని ప్రజలు గమనించాలని విజ్ఞప్తి చేశారు.

చిరుద్యోగుల వెతలు పట్టవా ?

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'ఒడ్డు చేరే వరకూ ఓడ మల్లన్న...చేరాక బోడి మల్లన్న' అన్న చందాన రాష్ట్రంలోని కూటమి సర్కారు తీరు ఉంది. ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలకు గుర్తొచ్చే చిరుద్యోగులు ఆ తర్వాత అధికారం చేతికి చిక్కిన తర్వాత కనిపించకపోవడం షరామామూలుగా మారిపోయింది. అలాంటి వారిలో గ్రామ, వార్డు సచివాలయ వాలంటీర్లు తాజాగా దర్శనమిస్తున్నారు. వాలంటీర్ల వ్యవస్థపై 'కూటమి' ప్రభుత్వం పూర్తిగా కక్ష సాధింపులకు దిగడమే కాకుండా రాజకీయ నిర్ణయం కూడా చేసినట్టు అనిపిస్తోంది. 'వారి సేవలను కొనసాగించం' అంటూ తేల్చేయడంతో వాలంటీర్లు అగమ్య గోచర స్థితిలో పడ్డారు.

గడచిన కొన్ని రోజులుగా వాలంటీర్లు తమ పొట్టకూటికోసం, ఉపాధి కోసం పోరాడుతున్నారు. గత ప్రభుత్వంలో వాలంటీర్లు రూ.5 వేలకే పనిచేయడాన్ని చూసి వెట్టి చాకిరీ చేయించుకుంటున్నారంటూ జగన్‌పై నిత్యం చంద్రబాబు విమర్శలు ఎక్కుపెట్టారు. తాము అధికారంలోకి వస్తే రూ.10 వేలు జీతంగా వాలంటీర్లకు ఇస్తామని చెప్పిన ఆయన వారిని నేడు పాతాళంలోకి తొక్కేసే నిర్ణయం చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గడచిన ఏడు నెలలుగా ఆర్థిక ఇబ్బందులతో అవస్థలు పడుతూ వేరొక ఉద్యోగానికి వెళ్లలేక గ్రామ, వార్డు స్థాయిలో వాలంటీర్లంతా

కొట్టుమిట్టాడడం స్పష్టంగా కనిపిస్తోంది. వీరేగాకుండా అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్ (ఆప్కాస్) ఉద్యోగులకు సైతం జీతాలను రెండు నెలలుగా ప్రభుత్వం ఇవ్వకపోవడంపై సర్వత్రా వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ప్రభుత్వ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు చాలా మందికి మూడు నెలల జీతానికి ఒక నెల చెల్లించే పద్ధతి ఇంకా ప్రభుత్వ శాఖల్లో కొనసాగుతోంది. వాలంటీర్ల విషయానికొస్తే వారు ఆకలి మంటలతో ప్రభుత్వాన్ని అర్థిస్తున్న పరిస్థితులు నెలకొన్నాయి. ప్రభుత్వ శాఖల్లోనే కాకుండా ప్రతిష్టాత్మకమైన వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లోనూ కాంట్రాక్టు ఉద్యోగుల పరిస్థితి ఆరు నెలలుగా దయనీయంగా మారిపోయింది.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం రెగ్యులర్, కాంట్రాక్టు ఉద్యోగులు ఓ వైపు పోరాడుతున్న క్రమంలో యాజమాన్యం వారికి జీతాల్లేకుండా చేయడం అత్యంత ఘోరమైన అంశంగా ఉంది. అయినా సరే పోరాట పథాన్ని వారు వదలకుండా నినదిస్తున్నారు. ఓ వైపు ప్రభుత్వ శాఖల్లోనూ, మరోవైపు పబ్లిక్ సెక్టార్ సంస్థల్లోనూ చిరుద్యోగులు చాలీచాలని బతుకులతో పండగ వేళ నెట్టుకురావడం అత్యంత విచారకరం.

స్టీల్‌ప్లాంట్ రక్షణకు 7న వామపక్షాల ధర్నా

విశాఖ కలెక్టరేట్ : ఈ నెల 8న విశాఖ పర్యటనకు వస్తున్న ప్రధాని మోడీ స్టీల్‌ప్లాంట్ అమ్మకపు నిర్ణయాన్ని రద్దు చేస్తూ, ప్లాంటుకు సొంత గనులు కేటాయిస్తూ ప్రకటన చేయాలని విశాఖ జిల్లా వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఈ నెల 7న ఉదయం 10 గంటల నుంచి జివిఎంసి గాంధీ విగ్రహం వద్దగల ఉక్కు దీక్షా శిబిరం వద్ద ధర్నా జరుగనుంది. జిల్లా వామపక్ష పార్టీల సమావేశంలో ఈ మేరకు నిర్ణయం చేసినట్టు సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గు నాయుడు తెలిపారు. జగదాంబ దరి సిపిఎం కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో జగ్గు నాయుడు, సిపిఐ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు, ఎస్‌యుసిఐ జిల్లా కార్యదర్శి గోవిందరాజులు, ఎంసిపిఐ జిల్లా కార్యదర్శి కె.శంకర్రావు, సిపిఐ ఎంఎల్ ప్రజా పోరు జిల్లా కార్యదర్శి దేవా తదితరులు మాట్లాడారు. విశాఖ ఉక్కు అశేష పోరాట, త్యాగాల ఫలితంగా ఏర్పడిందన్నారు. సుమారు లక్ష మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పిస్తూ విశాఖ అభివృద్ధిలో అత్యంత కీలక పాత్ర పోషిస్తోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పన్నులు, డివిడెంట్లు రూపంలో ఇంతవరకు రూ.54 వేల కోట్ల ఆదాయం సమకూర్చిందన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారం నేడు రూ.3 లక్షల కోట్ల పైచిలుకు ఆస్తిని కలిగి ఉందన్నారు. అటువంటి బంగారు బాతును కేంద్రంలోని మోడీ ప్రభుత్వం 100 శాతం అమ్మకానికి పెట్టడం ప్రజా ద్రోహ చర్య అని విమర్శించారు. తక్షణమే ప్రధాని మోడీతో రాష్ట్ర ప్రభుత్వం ఉక్కు ప్రైవేటీకరణ విరమించుకుంటున్నట్టు ప్రకటన చేయించాలన్నారు. విశాఖ ఉక్కు రక్షణ కోసం ఈ నెల 7న జరిగే ధర్నా, 8న జరిగే నిరసన కార్యక్రమాల్లో ప్రజలు, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

ఒకేచోట కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి - చోడవరం : 1991-94లో చోడవరం గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో చదువుకున్న విద్యార్థులంతా అడ్డూరులో ఉన్న ఓ రిసార్ట్స్‌లో ఆదివారం కలుసుకుని సందడి చేశారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ ఆత్మీయ సమావేశానికి ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ వేపాడ చిరంజీవిరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిత్రులు, విద్యార్థుల విస్తృత ప్రచారం తన విజయంలో కీలకపాత్ర పోషించిందని అన్నారు. అవినీతి, అబద్ధాలు లేని రాజకీయాలు చేయాలని అనుకుంటున్నానన్నారు. అనంతరం చిరంజీవిరావును మిత్రులంతా ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాగేశ్వరరావు, రమాకాంత్ బాబ్జీ, రవి ప్రతాప్, ఎస్.శ్రీను, సిహెచ్.వెంకటలక్ష్మి, గౌరినాయుడు, కోమలి, తదితరులు పాల్గొన్నారు.

24న డైరీ ఆవిష్కరణ

విశాఖపట్నం: ఈ నెల 24న జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆంధ్రప్రదేశ్ ఎస్‌సి, ఎస్‌టి గెజిటెడ్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ - 2025 డైరీ ఆవిష్కరణ సభ జరుగుతుందని అసోసియేషన్ విశాఖ యూనిట్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యజ్జల విజయ కుమార్, మల్లిపూడి సత్యనారాయణ, ఉపాధ్యక్షులు ముక్కల రాజేంద్ర కుమార్ తెలిపారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.సునీల్ కుమార్ నేతృత్వంలో జరిగే ఈ డైరీ ఆవిష్కరణ సభకు రాష్ట్ర మంత్రులు వంగలపూడి అనిత, నారా లోకేష్, గుమ్మడి సంధ్యారాణిని ఆహ్వానించినట్లు వారు తెలిపారు.

IN THE HONOURABLE COURT OF VII ADDITIONAL DISTRICT JUDGE CUM III METRO POLITAN SESSIONS JUDGE AT VISAKHAPATNAM
I.A. No. 741/2023 in O.S. No.538/2016

Between:
1. Smt. Dekkathi Nookalamma & others ...Petitioners/Plaintiffs
And
Dekkathi China Thatha & others ...Respondents/Defendants

NOTICE

To
R-3) Boyi Bangaramma
W/o. **Appanna,** R/o. Komatipalem Village Boddapalem post, Gambheeram Panchayathi, Anandapuram Mandal, Visakhapatnam District.,

Please take Notice that the above Named Petitioners/Plaintiffs has instituted the above I.A.against you and the same stands posted to **20-01-25 at 10.30A.M.** for your appearance, on that day you are Personally or through Advocate attend before the Hon`ble Court at **10.30A.M** failing which the matter will be heard and determined in your absence exparte as per law.

Y. NARSINGA RAO
B. APPALAREDDY
Advocates, VISAKHAPATNAM
Cell: 9391360473

మహారాజశ్రీ నర్సీపట్నం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A. 2/2022, O.S. 267/2022, లో
Between :
బైపల్లి అప్పారావు ...వాది.
మరియు
ముప్పిన రామకృష్ణ అండ్ ముప్పిన సతీష్ .... ప్రతివాది
టు.
1. ముప్పిన రామకృష్ణ **s/o** సత్తిబాబు, జోగింపేట, గొలుగొండ (మం) అనకాపల్లి జిల్లా.
2. ముప్పిన రాసతీష్ **s/o** సత్తిబాబు, జోగింపేట, గొలుగొండ (మం) అనకాపల్లి జిల్లా.

యీ నెంబరు దావా వాది పేరున మీరు తే : 12-11-2019 దిన వ్రాయించి యిచ్చిన ప్రాంసరీ నోటు తాలూకా అసలు వృద్దులు రూ. 5,03,400=00 (అక్షరములా ఐదు లక్షల మూడు వేల రూపాయిలు) కును దావా ఖర్చులు దర్మిలా వడ్డి రాబట్టే నిమిత్తం వాది పై నెంబరున మీపై దావా దాఖలు చేసియున్నారు. అందు విషయమై మీకు ఎట్టి ఆక్షేపణలు యున్నాను **తేది. 21-01-2025 దికి ఉదయం 10-30 గంటలకు** పైకోర్టు వారి యెదుట హాజరైమనవి చేసుకోవలెను. లేనియడల మీ పరోక్షమందు ఎక్స్ పార్ట్ ఆర్డర్ జారీ కాబడునని యిందు మూలంగా మీకు తెలియపర్చడమైనది.

నర్సీపట్నం **కామిరెడ్డిసత్యనారాయణ**
తేది : **వాది తరుపుఅడ్వకటు.**
04-01-2025. **సెల్ నెం. 7396732803**

విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ఉద్యోగుల సహకార పొదుపు మరియు పరపతి సంఘం లిమిటెడ్
రిజిష్టర్ నెం.బి-1918, ఉక్కునగరం, విశాఖపట్నం 530032

నోటీసు

ఇందు మూలముగా యావన్మంది సభ్యులకు తెలియజేయునది ఏమనగా లేటు శ్రీ కొరిబిల్లి చంద్రశేఖర్ గారు, ఎంప్లాయి నెం : 121153 తేది: 17.10.2021న మరణించినారని కుటుంబ సభ్యులైనటువంటి కుమారి గుణ నిధి సంఘంనకు తేది: 07.09.2023 నాడు తెలియజేసినారు. దానిని ధృవీకరిస్తూ రిజిస్ట్రార్ ఆఫ్ బర్త్స్ & డెత్స్, జి.వి.ఎమ్.సి, జోన్-5, వారు జారీ చేసిన మరణ ధృవపత్రం నమోదు సంఖ్య : డి-2021, 28-90225-002790, తేది: 03.11.2021, ద్వారా సంఘంనకు తేది: 07.09.2023 నాడు తెలియజేసినారు.

మరియు లేటు శ్రీ కొరిబిల్లి చంద్రశేఖర్ గారు సోసైటీలో చేరినపుడు నామినీగా తన తల్లి అయినటివంటి శ్రీమతి కొరిబిల్లి జగ్గాయ్యమ్మ గారిని నామినీగా ధృవీకరించినారు. సదరు కొరిబిల్లి జగ్గాయ్యమ్మ గారు కూడా తేది: 21.03.2016 నాడు మరణించినారని రిజిస్ట్రార్ ఆఫ్ బర్త్ & డెత్స్, జి.వి.ఎమ్.సి, జోన్-3 వారు జారీ చేసిన మరణధృవపత్రం రిజిస్ట్రేసన్ నెం : 256, తేది: 20.10.2017, ద్వారా సంఘంనకు తేది: 07.09.2023 నాడు తెలియజేసినారు.

లేటు శ్రీ. కొరిబిల్లి చంద్రశేఖర్ కుటుంబ సభ్యులుగా ఇచ్చిన దృవపత్రంలోని ఇద్దరులో ఒకరైన కొరిబిల్లి భగవతిరావు (తండ్రి) మరణించినారని దానిని ధృవీకరిస్తు రిజిస్ట్రార్ ఆఫ్ బర్త్ & డెత్స్ కింగ్ జార్జ్ హాస్పటల్, విశాఖపట్నం వారు జారీ : 4-2022, 28-90167-005344, తేది : 26.11.2022 ద్వారా సంఘమునకు తేది : 07.09.2023 నాడు తెలియజేసినారు.

కావున పైన తెలిపిన కుమారి కొరిబిల్లి గుణ నిధి కాకుండా ఇంకెవరైనా అర్హులైన వారసులు ఉన్న యెడల తేది : 20.01.2025 లోగా సంఘమునకు లిఖిత పూర్వకముగా తెలియజేయవలసినదిగా కోరడమైనది.

తదుపరి చర్యలు సంఘము యొక్క బైలా మరియు ఆంధ్రప్రదేశ్ సహకార చట్టము 1964 ననుసరించి జరుపబడును.

ఇట్లు
(డి. శ్రీరామచంద్ర మూర్తి),
కార్యదర్శి

ఇందిరమ్మ కాలనీలో సమస్యల తిష్ట

- నివాసాల చుట్టూ పొదలు
- అరకొరగా వీధి దీపాలు
- తప్పని తాగు నీటి అవస్థలు

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి ఒకటో వార్డు పరిధి కొండపేట పంప్ హౌస్ సమీపంలో కొండపై ఇందిరమ్మ కాలనీలో ఎన్నో సమస్యలు నెలకొని ఉన్నాయి. 2006 -07లో ఇందిరమ్మ పథకం కింద అప్పటి రాజశేఖరరెడ్డి ప్రభుత్వం ఇక్కడ సుమారు 70 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసింది. అప్పోసప్పో చేసి, అనేక ఇబ్బందులు పడి అతి కష్టం మీద లబ్ధిదారులు సొంత గూడు నిర్మించుకున్నారు.

నివాసాల చుట్టూ పొదలు...

ఈ కాలనీలో నివాసాల చుట్టూ ఎక్కడికక్కడే ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి ఉన్నాయి. మెట్ల మార్గానికి రెండు వైపులా ఉన్న ఇందిరమ్మ ఇళ్లతో పాటు మిగిలిన ఇళ్లు సుమారు 40కిపైబడి ఉన్నాయి. ఇక్కడ రెండే వీధి దీపాలు వెలుగుతున్నాయి. మరో నాలుగు విద్యుత్ స్తంభాలు, వీధి దీపాలు వెయ్యాలని స్థానికులు కోరుతున్నారు.

కొండకు అనుకుని ఉన్న దాదాపు 30 ఇళ్లకు ఒక్క విద్యుత్ స్తంభమూ లేదు. వీధి దీపాలు ఎలాగూ లేవు. చిమ్మ చీకట్లో ఉంటున్నామని, పాము, పుట్ర ఇళ్లల్లోకి వస్తున్న సందర్భాలు అనేకమని స్థానిక మహిళలు ఆదివారం ప్రజాశక్తి వద్ద వాపోయారు. పిల్లా పాపలతో ఇబ్బందులు పడుతున్నామని అంటున్నారు.

తాగునీటికి ఇక్కట్లు..

పక్కనే ఉన్న పంప్ హౌస్ నుంచి తగరపువలస పరిధిలోని పలు ప్రాంతాలకు తాగు నీరు సరఫరా అవుతుంది. ఇక్కడున్న 30 కుటుంబాలకు తాగు నీరు లేని పరిస్థితి. ఇప్పటి వరకు తమ ఇళ్లకు పన్నులు వెయ్య లేదని, దీంతో ఇంటి కుళాయిలు వెయ్య లేదని మహిళలు అవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ పేద కుటుంబాలే నివసిస్తున్నాయి. వీరికి తాగు నీరు, విద్యుత్ సరఫరా, మురుగు కాలువల నిర్మాణం లాంటి మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత జివిఎంసికి ఉన్నా 2006 నుంచి ఇప్పటి వరకు ఏళ్లు గడిచిపోతున్నా పబ్లిక్ కుళాయిలు ఏర్పాటుచేయలేదని స్థానికులు చెబుతున్నారు. కొన్ని సాంకేతిక కారణాలు చూపి, ఇళ్లకు ఆస్తి పన్ను విధించడంలేదని స్థానికులు అంటున్నారు.

నివాసాలకు అనుకుని పిచ్చి మొక్కలు

వీధి దీపాలు ఏర్పాటుచేయాలి

వీధి దీపాలు లేక ఇళ్లల్లోకి రాత్రి వేళల్లో పాములు వస్తున్నాయి. చిన్న పిల్లలే కాదు పెద్దలు కూడా భయపడుతున్నారు. ముందుగా విద్యుత్ స్తంభాలు వేసి వీధి దీపాలు వేయాలి. కాల్వలు నిర్మించాలి.

పి.సన్యాసమ్మ

పబ్లిక్ కుళాయిలు వేయాలి

పబ్లిక్ కుళాయిలు లేవు. దీంతో తాగు నీటి కోసం కుళాయిలు ఉన్న వారి ఇళ్ల వద్దకు వెళ్లి బతిమలాడుకొని బిందెడు నీరు తెచ్చుకుని తాగు నీటి అవసరాలు తీర్చుకుంటున్నాం. స్నానానికి, ఇతరత్రా అవసరాలకు చేతి బోరు వద్దకు వెళ్లి నీరు తెచ్చుకుంటున్నాం.

జి.సుహాసిని

అన్నీ సమస్యలే...

ఇక్కడ అన్నీ సమస్యలే. ఇచ్చే తాగు నీరు సరిపడా లేదు. ఉన్న చేతి బోరు ద్వారా బిందెడు నీరు కావాలంటే అరగంట సమయం పడుతుంది. మెట్ల మార్గం నుంచి కొండపైకి ఎక్కడం చాలా ఇబ్బందిగా ఉంది. అరకొరగా వీధి దీపాలు ఉన్నాయి.

పి.లక్ష్మి

బిపి కల్లాల రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం బంటుపల్లి వారి పంచాయతీ గొట్టిపల్లి కల్లాల నుంచి ఆకులవారి కల్లాలు వరకు రూ.30 లక్షలతో రోడ్డు పనులను ప్రారంభించినట్లు తెలుగుదేశం నాయకులు బంటుపల్లి శ్రీనివాసరావు తెలిపారు. రెండు మూడు రోజుల్లో ఈ పనులు పూర్తి చేస్తామన్నారు. గత వైసిపి ప్రభుత్వం రోడ్లను పట్టించుకోకుండా వదిలేసిందని, కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక గ్రామాల్లో రోడ్లు, మౌలిక వసతులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. రోడ్డు పనులు ప్రారంభించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

రోడ్డు పనులు ప్రారంభంలో శ్రీనివాసరావు

ప్రతి అక్షరం-ప్రజల పక్షం
ప్రజాశక్తి
తెలుగు దినపత్రిక
అనుభవం కలిగిన
సబ్ ఎడిటర్
కావలెను
ప్రజాశక్తి కార్యాలయం
ప్లాట్ నెం.3, జి.బ్లాక్, ఆటోనగర్, ఇండస్ట్రియల్ పార్క్, వడ్లపూడి, ఎం.వి.వి.అపార్ట్‌మెంట్ ప్రక్కన
విశాఖపట్నం-530046
ఫోన్ : 9491570765

కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి

మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి

విద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రి శ్రీబాలవీరాంజనేయ స్వామి

ప్రజాశక్తి - ఆరిలోవ : విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోల శ్రీబాల వీరాంజనేయస్వామి సూచించారు. విశాఖ కేంద్రకారాగారం వద్ద గల శ్రీకృష్ణాపురం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఆదివారం మంత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలోని వంటగది, మరుగుదొడ్లు, విద్యార్థులు నిద్రించే గదులను, పరిసరాలను పరిశీలించారు. పారిశుధ్య లేమి పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన ప్రిన్సిపల్ పట్ల చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఆయన విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. విద్య, క్రమశిక్షణ, ఆరోగ్యం, పరిశుభ్రత ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులకు తమ ప్రభుత్వం అన్ని సౌకర్యాలూ కల్పిస్తోందన్నారు. విద్యార్థుల పట్ల సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్శనలో గురుకుల పాఠశాలల కో-ఆర్డినేటర్ రూపావతి, ప్రిన్సిపల్ రత్నవల్లి, అధికారులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

ప్రజాశక్తి - ఆరిలోవ : నిత్యం వందలకొద్దీ వాహనాలు రాకపోకలు సాగించే జాతీయరహదారిపై పెద్ద కాంక్రీట్ దిమ్మ రోడ్డుకు అతుక్కుపోయి ఉంది. దీని వల్ల వాహనదారులు ప్రమాదాల బారిన పడే ప్రమాదం పొంచి ఉంది. ఇది అందరికీ కనబడుతున్నా సంబంధిత శాఖాధికారులు గమనించక పోవడం గమనార్హం. జాతీయరహదారిలో హనుమంతువాక మేకల కబేళా నుంచి వెంకోజిపాలెం వెళ్లే మార్గంలో ఒక పెద్ద కాంక్రిట్ దిమ్మ రహదారికి అతుక్కు పోయి ఉంది. రాత్రిపూట దీనిని గమనించలేక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా ఎన్‌హెచ్ఎఐ సంస్థ రహదారి మధ్యలో ఉన్న కాంక్రీట్ దిమ్మను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

జాతీయ రహదారిపై కాంక్రీట్ దిమ్మ

హనుమంతువాక నుంచి వెంకోజిపాలెం వెళ్లే మార్గంలో అతుక్కుపోయిన కాంక్రిట్ దిమ్మ

నేరాలు ఘోరాలు

6 కిలోల గంజాయితో ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి- చోడవరం రూరల్: :మండలంలోని గౌరీపట్నం జంక్షన్ వద్ద పోలీసులు జరిపిన వాహన తనిఖీల్లో కారులో తరలిస్తున్న ఆరు కిలోల గంజాయిని పట్టుకుని, ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. ఎస్ఐ సి.నాగకార్తీక్ తెలిపిన వివరాలివి. ముందుస్తు సమాచారం మేరకు సిఐ ఆదేశాలతో పోలీసులు వాహన తనిఖీలు చేయగా, ఎపి 31బి 5783వాగనార్ కారులో ప్రయాణిస్తున్న ౧ చింతలపూడి. లావణ్య వెంకట సత్యకుమార్, చొప్పా. దిలీప్ వద్ద ఆరు కిలోల గంజాయి పట్టుబడింది.గంజాయి స్వాధీనం చేసుకుని, నిందితులిద్దరినీ అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ సి.నాగకార్తీక్ తెలిపారు.

ఎపి టార్గెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులుగా కంచర్ల అచ్యుతరావు

ప్రజాశక్తి - ఆరిలోవ : ఆంధ్రప్రదేశ్ టార్గెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ ఇండస్ట్రీస్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ చైర్మన్, ఉపకార్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత, సినీ నిర్మాత డాక్టర్ కంచర్ల అచ్యుతరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విశాఖలో ఆదివారం ఉదయం జరిగిన ఆంధ్రప్రదేశ్ టార్గెట్ బాల్ అసోసియేషన్ తృతీయ వార్షిక సర్వసభ్య సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా కంచర్ల అచ్యుతరావు మాట్లాడుతూ, టార్గెట్ బాల్ క్రీడకు పూర్వ వైభవం తీసుకొస్తానన్నారు. పాఠశాల స్థాయిలో టార్గెట్ బాల్ క్రీడను తీసుకెళ్తామని చెప్పారు. ఈ ఏడాది మార్చిలో విశాఖలో జాతీయ స్థాయి టార్గెట్ బాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. యువత చెడు మార్గం పట్టకుండా పయనించేందుకు ఉపకార్ చారిటబుల్ ట్రస్ట్ క్రీడలకు పెద్ద ఎత్తున ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జాతీయ టార్గెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరవ్ శర్మ, రాష్ట్ర కార్యదర్శి సురేష్, సూర్య నారాయణ, ఉపకార్ ట్రస్ట్ మేనేజర్ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎంపిలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ అచ్చెన్నాయుడు

ఆర్ఎంపి వైద్యులకు అవగాహన

ప్రజాశక్తి -పద్మనాభం : పద్మనాభం గ్రామంలో ఉన్న కన్యకా పరమేశ్వరి ఆలయం వద్ద ఆదివారం పద్మనాభం మండల గ్రామీణ వైద్యులకు విశాఖపట్నం, విజయనగరంలో ఉన్న రామచరణ్య హాస్పటల్ అధినేత, చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ బిఆర్.అచ్చన్నాయుడు అవగాహన కల్పించారు. చిన్న పిల్లలకు ఎక్కువ జ్వరం వచ్చినప్పుడు తడిగుడ్డ వైద్యం చేస్తూ పారాసెటమాల్ మందును వయసు, బరువు ఆధారంగా ఇవ్వాల్సిన డోస్‌ను వివరించారు. యాంటీబయోటిక్ మందులు ఇవ్వరాదని తెలిపారు. రెండుమూడు రోజులకు మించి జ్వరం తగ్గకపోతే ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని సూచించారు. ప్రథమ చికిత్స ఎలా చెయ్యాల్లో కూడా వివరించారు. తల కిందికి దించుకొని పైకి ఎత్తలేకపోవడం, ఫిట్స్, మగతగా, నిస్సత్తువుగా ఉన్నవారిని, నీలం రంగులో, తెల్లగా పాలిపోయిన వారిని గుర్తించి ఎమర్జెన్సీగా పీడియాట్రిక్ ఫిజీషియన్‌కు రిఫర్ చేయాలని సూచించారు. రాలి అప్పారావు ఆధ్వర్యాన జరిగిన ఈ వైద్య విజ్ఞాన అవగాహన సదస్సులో ఎంవి.రమణ, యు.తాతబాబు, ఎంవి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నర్సింగరావును సన్మానిస్తున్న అయోధ్యరాం తదితరులు

రాష్ట్ర స్థాయి క్రీడల్లో ప్రతిభ చూపిన.. అగనంపూడి యువకునికి సన్మానం

ప్రజాశక్తి -ఉక్కునగరం : రాష్ట్ర స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలో ప్రతిభ కనబర్చిన అగనంపూడి దిబ్బపాలెం కాలనీకి చెందిన ఉక్కు కార్మికుడు చట్టి నర్సింగరావును సిఐటియు ఆధ్వర్యాన ఆదివారం సన్మానించారు. ముఖ్యఅతిథిగా స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్ హాజరై మాట్లాడుతూ, చట్టి నర్సింగరావు ఒకపక్క ఉద్యోగ బాధ్యతలు నిర్వహించడంతోపాటు మరో పక్క క్రీడల్లో రాణించడం స్టీల్‌ప్లాంట్‌కు గర్వకారణం అన్నారు. గత నెల 28, 29 తేదీల్లో గుంటూరులో జరిగిన పోటీల్లో 5 కిలోమీటర్ల నడకను 27 నిమిషాల్లో పూర్తిచేసి బంగారు పతకం, 5 కిలోమీటర్ల పరుగును 21 నిమిషాల్లో పూర్తిచేసి రజత పతకం సాధించారని తెలిపారు. ఈ నెల కేరళ రాష్ట్రం తిరుచూరులో జరిగే జాతీయ పోటీలకు ఎంపికయ్యారని వివరించారు. సిఐటియు అగనంపూడి అధ్యక్షులు మెలి కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు పెదిరెడ్ల నీలకంఠం, ఉరిటి మరిడయ్య, పట్టా రమేష్, ఉరిటి అప్పలరాజు, వంకర రాము, ఎలమంచిలి వీరప్పారావు, దుర్గారావు, పట్టా నర్సింగరావు, ఈగల ప్రసాద్, బొట్ట కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

7న రంగోత్సవ్ పోటీలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ డైట్‌లో ఈ నెల 7వ తేదీన ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి రంగోత్సవ్ 2024 -25 పోటీలను నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ ఎం.జ్యోతికుమారి తెలిపారు. క్విజ్, చిత్ర లేఖనం, దస్తూరి, ముగ్గుల పోటీలు, జానపదనృత్యం, రోల్‌ప్లే, స్లోగన్ రైటింగ్ అంశాలపై పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. 6 నుంచి 12వ తరగతి విద్యార్థులు ఈ పోటీలకు అర్హులని తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని పేర్కొన్నారు.

దొడ్డి కొమరయ్య చిత్ర యూనిట్ సభ్యులను సత్కరిస్తున్న తెలంగాణ ఉద్యోగులు సంక్షేమ సంఘం సభ్యులు

దొడ్డి కొమరయ్య చిత్ర యూనిట్ ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి -ఉక్కునగరం : దొడ్డి కొమరయ్య చిత్ర యూనిట్ ఆత్మీయ సమావేశం ఉక్కునగరంలో ఆదివారం నిర్వహించారు. ఉక్కు తెలంగాణ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆహ్వానం మేరకు దొడ్డి కొమరయ్య చిత్ర యూనిట్ ఉక్కు నగరంలో సమావేశం నిర్వహించింది. తెలంగాణ ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో డైరెక్టర్ ఎం.సేనాపతి మాట్లాడుతూ, దొడ్డి కొమరయ్య చిత్ర విశేషాలను వివరించారు. తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య అని తెలిపారు. ముఖ్య అతిథిగా హాజరైన ఉక్కు జనరల్ మేనేజర్ ఎన్.వీరేశం మాట్లాడుతూ, ప్రజలకు మంచి సందేశాన్ని ఇచ్చే సినిమాలు రావాలన్నారు. ఈ సమావేశంలో సంఘం అధ్యక్షులు ఎన్.కుమారస్వామి, ఎడ్వైజర్లు కె.వేణుగోపాల్, ఎన్.బలరాం, జె.శ్రవణ్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ బి.వెంకటేశ్వర్లు, ప్రతినిధులు టి.ప్రభాకర్, సిహెచ్.రవికుమార్, వి.సహదేవ్, ఆర్.నరసింహ, దొడ్డి కొమరయ్య చిత్ర టీం సభ్యులు అబ్దుల్ రహిమాన్, తక్కెళ్లపల్లి విజయకుమార్, రావుల శ్రీనివాస్, ఎం.నాగసూర్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎడి కార్మికుల వంటా వార్పు

ప్రజాశక్తి -గోపాలపట్నం : ఎన్ఎడి కార్మికులు, నాయకుల అక్రమ సస్పెన్షన్, పోలీసు కేసులను వ్యతిరేకిస్తూ ఎన్ఎడిసిఐ యూనియన్ చేపట్టిన దీక్షల్లో భాగంగా ఆదివారం సత్యాగ్రహ శిబిరం వద్ద వంటావార్పు చేపట్టారు. వంటా వార్పు కార్యక్రమాన్ని కెబిఆర్.ప్రసాదరావు ప్రారంభించి మాట్లాడుతూ, తన 60 సంవత్సరాల ట్రేడ్ యూనియన్ ఉద్యమ చరిత్రలో ఎప్పుడూ ఇటువంటి ఉన్నతాధికారులను చూడలేదన్నారు. సమస్యలపై దేశవ్యాప్తంగా అనేక పోరాటాలు జరిగాయని, చర్చలకు పిలిచి కార్మిక నాయకులను, కార్మికులను సస్పెండ్ చేయడం మొదటి సారి చూస్తున్నానన్నారు. ఎన్ఎడిలో జనరల్ మేనేజర్‌గా పనిచేసినప్పుడు తప్పుకాని స్టోరేజ్ ఓటి, సిజిఎం అయ్యాక ఎందుకు తప్పయిందో ఆయనే చెప్పాలన్నారు. ఇప్పటికైనా చేసిన తప్పును అంగీకరించి 36 మంది సస్పెన్షన్లను, ఆరుగురిపై పెట్టిన పోలీసు కేసును వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

గౌరవ అతిథిగా అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.పద్మ హాజరై మాట్లాడుతూ, ఎన్ఎడి మేనేజ్‌మెంట్ చర్యలను తీవ్రంగా ఖండించారు. మహిళలను చర్చలకు పిలిచి, అసభ్యంగా మాట్లాడి సస్పెండ్ చేసిన సిజిఎంపై మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. పబ్లిక్ రంగ సంస్థల కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ జ్యోతీశ్వరరావు మాట్లాడుతూ, ఎన్ఎడి కార్మికుల పోరాటానికి విశాఖ జిల్లాలో ఉన్న పబ్లిక్ రంగ సంస్థల కార్మికులందరూ అండగా ఉంటారన్నారు. సిఐటియుగా తాము ఆ బాధ్యత తీసుకుంటామని చెప్పారు. డిఫెన్స్ కో-ఆర్డినేషన్ కమిటీ చైర్మన్ రెడ్డి వెంకట్రావు మాట్లాడుతూ, 8వ తేదీన విశాఖ వస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ దృష్టికి విశాఖ రక్షణ రంగంలో కార్మికులపై జరుగుతున్న దాడులను, వివక్షతను తెలియజేస్తామని చెప్పారు. ఎఐడిఈఎఫ్ అఖిల భారత కార్యవర్గ సభ్యులు గోపాలరావు మాట్లాడుతూ, సమస్యను యాజమాన్యం తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకుంటే రక్షణ రంగ కార్మికులు భారీ ఎత్తున పోరాడుతారని హెచ్చరించారు. ఎఐడిఇఎఫ్ ప్రధాన కార్యదర్శి శ్రీకుమార్ జనవరి 7న విశాఖ సందర్శిస్తున్నారని, మేనేజ్‌మెంట్‌తో చర్చలు జరుపుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు శ్రీనివాసరావు, నూకరాజు, డి.వి.శ్రీనివాస, రామకృష్ణంరాజు, సత్యనారాయణ, శ్రీనివాస్, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వంటావార్పులో పాల్గొన్న ఎన్ఎడి కార్మికులు

కనీస పెన్షన్ రూ.9 వేలు చెల్లించాలి

కెవిపిఎస్ కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న పెన్షన్‌దారులు

ప్రజాశక్తి- గాజువాక : ఇపిఎస్-95 పెన్షన్‌దారులకు కనీస పెన్షన్ రూ.9 వేలు చెల్లించాలని ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ నాయకులు బైరెడ్డి గుర్రప్ప, డి.వెంకట్రావు డిమాండ్‌చేశారు. పెదగంట్యాడ సిడబ్ల్యుసిలో ఆదివారం పెన్షనర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పెన్షన్‌దారులకు మెడికల్ సదుపాయాలు కల్పించాలని కోరారు. సిఐటియు నాయకులు వైటి.దాస్ మాట్లాడుతూ, హక్కుల కోసం 150 సంవత్సరాల క్రితం మహాత్మాజ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే కృషి చేశారన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ప్రజల కోసం రాజ్యాంగం రచించారన్నారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ ముద్రించిన కేలండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలో కొనసాగాలని, సెయిల్‌లో విలీనం చేయాలని కోరుతూ పాదయాత్ర చేశారు.

ఎన్నికల హామీలను అమలుచేయాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రామాటాకీస్ జంక్షన్ వద్ద శ్రీరామ ఆటో స్టాండ్ డ్రైవర్లు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి మాట్లాడుతూ, కేంద్రంలో బిజెపి అధికారంలోకి వస్తే 100 రోజుల్లో డీజిల్, పెట్రోల్, వంట గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గిస్తామని హామీ ఇచ్చి పదేళ్ల గడిచినా ఒక్క హామీని కూడా అమలు చేయలేదని మండిపడ్డారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలుచేయని ప్రజాప్రతినిధులపై ఎన్నికల సంఘం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. 2023 నూతన మోటార్ చట్టాన్ని ప్రధాని మోడీ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో చంద్రబాబు ఆటో డ్రైవర్లకు హామీ ఇచ్చిన వాహన మిత్ర రూ.15 వేలు వెంటనే అమలుచేయాలని, జిఓ 21, 31లను రద్దుచేయాలని, ఇఎస్ఐ, పెన్షన్‌తో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటుచేయాలని, నగర పరిధిలో ఉబర్, ఓలా, ర్యాపిడ్ వాహనాలను నిషేధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిహెచ్.యోహాన్, పి.శ్రీనివాస్, ఎ.దుర్గాప్రసాద్, పైడిరెడ్డి, చిన్నరెడ్డి, ఎస్.రాము, ఎ.సురేష్, కె.శివ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం విశాఖపట్నం జిల్లా నూతన కార్యవర్గ సభ్యులు ఆదివారం ఎంవిపి.కాలనీలోని గిరిజన భవన్‌లో ప్రమాణ స్వీకారం చేశారు. మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు, అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు పివి.రమణ, ప్రధాన కార్యదర్శి హరేరామ్, రాష్ట్ర అధ్యక్షులు కొరాబు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి దినరీ ప్రభాకర్, జిల్లా పూర్వ నాయకులు ఆధ్వర్యాన నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణం చేశారు. నూతన కార్యవర్గం అధ్యక్షులుగా సోనాయి అప్పలరాజు, ప్రధాన కార్యదర్శిగా కటారి శోభన్‌కుమార్, కార్యనిర్వాహక అధ్యక్షులుగా రాథోడ్ వజ్రం, ఉపాధ్యక్షులుగా ముత్యంగి ప్రసాదరావు, సంయుక్త కార్యదర్శిగా వంతల క్రీ దొర, కార్యాలయపు కార్యదర్శిగా జంపరంగి రాంబాబు, కోశాధికారిగా సీసా శోభన్, కార్యనిర్వాహక కార్యదర్శిగా సమరెడ్డి బాలగంగాధర్ తిలక్, సహాయ కార్యదర్శిగా కొండగొర్రి ప్రసాదరావు, గిరిజన భవన్ అభివృద్ధి కమిటీ అధ్యక్షులుగా గింగ్రి దాలిబాబు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం జిల్లా గిరిజన ఉద్యోగులు, సీనియర్ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

ప్రమాణం చేస్తున్న అఖిలభారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం సభ్యులు

స్కేటర్లకు అభినందనలు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : విశాఖకు చెందిన స్కేటర్లు జాతీయ స్థాయిలో పతకాలు సాధించటం అభినందనీయమని వియంఆర్‌డిఎ చైర్మన్ ఎంవి.ప్రణవ్‌గోపాల్ అన్నారు. బీచ్ రోడ్డులోని వియంఆర్‌డిఎ పార్కులో విశాఖ స్కేటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యాన జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన స్కేటర్లకు, కోచ్‌లకు ఆదివారం అభినందన, సత్కార కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రణవ్‌గోపాల్ హాజరై మాట్లాడుతూ, క్రీడాకారులు సాధించే విజయాల వెనుక తల్లిదండ్రుల కృషి అపారమన్నారు. విద్యార్థుల వికాసానికి క్రీడలు ఉపయుక్తంగా నిలుస్తాయని తెలిపారు. పిల్లలను క్రీడల్లో ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులను అభినందించారు. వియంఆర్‌డిఎ నుంచి అవసరమైన సహకారాన్ని, రాష్ట్ర ప్రభుత్వం నుంచి తోడ్పాటును క్రీడలకు అందిస్తామని చెప్పారు. అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన స్కేటర్లు, కోచ్‌లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు, స్కేటర్లు పాల్గొన్నారు.

క్రీడాకారులకు జ్ఞాపికలు అందిస్తున్న ప్రణవ్‌గోపాల్

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

● ప్రజా రవాణా కార్మికులను ఆదుకోవాలి
● జిల్లా సదస్సులో జాతీయ కార్యదర్శి లక్ష్మయ్య

మాట్లాడుతున్న జాతీయ కార్యదర్శి ఆర్ లక్ష్మయ్య

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్రంలో ఆటో మోటార్ ట్రాన్స్‌పోర్ట్ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని అఖిలభారత రోడ్డు మోటార్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్ లక్ష్మయ్య డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో ఆటో మోటార్ ట్రాన్స్‌పోర్ట్ కార్మికుల జిల్లా సదస్సులో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాల వలన డ్రైవర్లు, కార్మికుల జీవనం అత్యంత దుర్భరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. డీజిల్ రేట్లు పెంపుదల ద్వారా రవాణా రంగ కార్మికుల ఆదాయాలు తీవ్రంగా కోత పడ్డాయన్నారు. ఒక్కొక్క కార్మికుడిపై సంవత్సరానికి రూ.ఏడు లక్షల వరకు జేబులకు చిల్లుపడిందన్నారు.. ప్రజారవాణాలో పనిచేస్తున్న కార్మికులకు సామాజిక సంక్షేమ చట్టం అమలు చేసి సంక్షేమ బోర్డు ద్వారా సహకారం అందించాలని డిమాండ్ చేశారు. 2021-22లో రవాణా రంగం ద్వారానే ప్రభుత్వాలకు రూ.ఐదు లక్షల కోట్ల ఆదాయం సమకూరిందని, దీనిలో 6శాతాన్ని కేటాయించి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.కార్పొరేట్ సంస్థలకు రూ.పదహారు లక్షల కోట్లు రుణాలు మాఫీ చేసిన బిజెపి ప్రభుత్వం, కార్మికుల సంక్షేమ బోర్డుకు రూ.30వేల కోట్లు పెట్టకపోవడం శోచనీయమన్నారు. లైసెన్సు, ఫిట్నెస్ తదితర సౌకర్యాలు ప్రైవేటుకు దారాదత్తం చేసి రవాణా కార్మికులకు, డ్రైవర్లపై మరింత భారవం వేయడం తగదన్నారు. కేరళ రాష్ట్రం మాదిరి పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్‌కు దేశవ్యాప్తంగా ప్రభుత్వమే ఒక యాప్ పెట్టి ఓలా, ఉబర్ తదితర కార్పొరేట్ సంస్థలను కట్టడి చేయాలని అన్నారు. డీజిల్ ధరలను నియంత్రించాలని, పెంచిన పెనాల్టీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. యూనియన్ గౌరవాధ్యక్షులు జి దేవుడు నాయుడు అధ్యక్షత జరిగిన సమావేశంలో ఎపిఎస్ఆర్‌టిసి అద్దె బస్, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ నాయకులు వి.తులసీరామ్, హైర్ బస్ డ్రైవర్ల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పలకా సత్యనారాయణ, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్ శంకరరావు, ఆర్టిసి సిఎస్‌డబ్ల్యుఎఫ్ యూనియన్ అనకాపల్లి జిల్లా కార్యదర్శి పిఎన్‌వి పరమేశ్వరరావు, వివి శ్రీనివాసరావు, గనిశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

జిల్లా కన్వీనింగ్ కమిటీ ఏర్పాటు.

జిల్లా మోటార్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ కన్వీనింగ్ కమిటీ ఏర్పాటుచేశారు. జిల్లా కన్వీనర్‌గా జి. దేముడు నాయుడు ఎన్నిక కాగా 12 మందితో కమిటీ ఏర్పాటైంది.

ఉపాధ్యాయులకు అందని జీతాలు

ప్రజాశక్తి -అనకాపల్లి : కొత్తసంవత్సరం, జనవరి నెలలో 5వ తేదీ గడిచిపోయి ఆరవ తేదీ వస్తున్నా ఉపాధ్యాయులకు ఇంకా జీతాలు అందకపోవడం విచారకరమని యుటిఎఫ్ అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయి ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల వాగ్దానాల్లో భాగంగా ప్రతినెలా ఒకటో తేదీనే జీతాలు ఇస్తామన్నారని, హామీ ఇచ్చారని, అయితే జూన్ నెలలో మాత్రమే ఒకటో తేదీని జీతాలు వేసి, తర్వాత నెల నుండి ఒకటో తేదీ కాకుండా రెండు,మూడు రోజులు ఆలస్యంగా వేతనాలు ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. జీతాలు ఆలస్యం వలన ఇఎంఐలు, కరెంట్ బిల్లులు పిల్లల ఫీజులకు మరలా అప్పులు చేయాల్సి వస్తోందన్నారు. గత ప్రభుత్వంలో ఉద్యోగ, ఉపాధ్యాయులు ఇవే ఇబ్బందులతో మనశ్శాంతి లేకుండా పోయిందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

బీచ్ హ్యాండ్‌బాల్ టోర్నీ విజేత విశాఖ

విజేతలకు బహుమతులిస్తున్న సతీష్‌కుమార్

ప్రజాశక్తి- అచ్యుతాపురం : పూడిమడక సముద్రతీరంలో శని, ఆదివారాలు రెండు రోజులు పాటు నిర్వహించిన రాష్ట్రస్థాయి బీచ్ హ్యాండ్‌బాల్ పోటీలు ముగిసాయి. ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ సొంత నిధులతో నిర్వహించిన ఈ టోర్నమెంట్‌లో విశాఖపట్నం జిల్లా జట్టు ప్రథమ స్థానం సాధించింది. కర్నూలు, ప్రకాశం జట్టు ద్వితీయ తృతీయ స్థానాలు సాధించారు. విజేతలకు జనసేన ఉత్తరాంధ్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి సుందరపు సతీష్‌కుమార్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సతీష్ కుమార్ మాట్లాడుతూ రెండు రోజులపాటు పూడిమడకలో నిర్వహించిన రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలు విజయవంతానికి గ్రామస్తులందరూ రాజకీయాల కతీతంగా సహకరించడంపై కృతజ్ఞతలు తెలిపారు. ఇటువంటి పోటీలతో మత్స్యకారులు క్రీడలలో రాణించడానికి అవకాశం ఉంటుందన్నారు. మాజీ జెడ్‌పిటిసి జనపరెడ్డి శ్రీనివాసరావు, మాజీ ఎంపిటిసి మెరుగు బాపునాయుడు, జనసేన మండల శాఖ అధ్యక్షులు బి రాందాస్ పాల్గొన్నారు.

నారా లోకేష్‌కు పలువురి అభినందన


లోకేష్‌తో నాగజగదీష్ పెనుమత్స కృష్ణంరాజు, నాగేశ్వరరావు

ప్రజాశక్తి -అచ్యుతాపురం :విశాఖ పర్యటనకు వచ్చిన రాష్ట్రమంత్రి నారా లోకేష్‌ను విశాఖ విమానాశ్రయంలో ఆదివారం మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగ జగదీష్, ఎపి రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్చం ఇచ్చి స్వాగతించారు.

అనకాపల్లి : రాష్ట్ర విద్యాశాఖమంత్రి నారా లోకేష్‌ను ఆదివారం విశాఖపట్నం విమానాశ్రయంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఎఎంఎఎల్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం కార్యదర్శి పెనుమత్స కృష్ణంరాజు మర్యాదపూర్వకంగా కలిశారు.

గోదాదేవి సారె ఊరేగింపు

ప్రజాశక్తి-అనకాపల్లి : సుంకరమెట్ట సత్యనారాయణ స్వామి, సూర్యనారాయణ స్వామి దేవస్థానంలో సత్యదేవా భక్త బృందం ఆధ్వర్యంలో ఆదివారం గోదాదేవి అమ్మవారికి సారె మహోత్సవం జరిగింది. దేవస్థానం చైర్మన్ బొడ్డేడ మురళి, ఇఒ బి.మురళీకృష్ణ పాల్గొని ప్రారంభించారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు మారిశెట్టి భాస్కరరావు, పెంటకోట చంద్రరావు, శ్రీకాకుళం గణపతి, సూరిశెట్టి బల్లమ్మ, దొడ్డి భరత్, తురకలపూడి హేమ, బుద్ద మురళి, తాతారావు, కమల పాల్గొన్నారు.

సుగర్స్ బకాయిల చెల్లింపు హామీ ఏమైంది?

● కూటమి నేతలను ప్రశ్నించిన మాజీ ఎమ్మెల్యే ధర్మశ్రీ

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ

ప్రజాశక్తి - చోడవరం : దసరానాటికి గోవాడ సుగర్స్ సభ్య రైతులకు, సిబ్బందికి ఇవ్వాల్సిన రూ. 16కోట్ల బకాయిలు చెల్లింపు హామీ ఏమైందని మాజీ ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ప్రశ్నించారు.. ఆదివారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఈ సీజన్ క్రషింగ్ ప్రారంభించగా, గత సీజన్‌బకాయిలు ఇప్పటివరకు చెల్లించలేదన్నారు. సంక్రాంతి పండుగ సమీపిస్తున్న తరుణంలో ఇప్పటికైనా ఎమ్మెల్యే కెఎస్ఎన్.రాజు, కూటమి నేతలు ఇచ్చిన మాటను నిలబెట్టుకుని బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అయితే దీనికి సంబంధించి ఎటువంటి ప్రయత్నాలు జరగడం లేదని ఆక్షేపించారు. గత ఐదేళ్లలో వైసిపి హయాంలో డిసెంబర్ రెండు, మూడు వారాలలోనే క్రషింగ్ ప్రారంభించామని, ఈసారి డిసెంబరులో క్రషింగ్ ప్రారంభం కాలేదన్నారు సభ్య రైతులకు టన్నుకు రూ.350 బకాయి చొప్పున రూ.ఏడు కోట్ల 16 లక్షల చెల్లించాల్సి ఉందన్నారు. ఇవి కాకుండా టన్ను రూ.50 చొప్పున గేట్ ఏరియా డబ్బులు కూడా చెల్లించాల్సి ఉందన్నారు. సిబ్బందికి రూ. 6.50 కోట్ల జీతభత్యాలు చెల్లించాల్సి ఉందన్నారు. దీంతోపాటు ఈ ఏడాది ఫ్యాక్టరీ నిర్వహణకు రూ.మూడు కోట్లు అవసరమన్నారు. అయితే దీనికి సంబంధించి ఎటువంటి చర్యల్లేకపోవడం శోచనీయమన్నారు. తమ పాలనలో రూ.88 కోట్లను గ్రాంట్‌గా తెచ్చి, ఫ్యాక్టరీకి ఊపిరి పోసామన్నారు. ఫ్యాక్టరీలో పంచదార మొలాసిస్ కో జనరేషన్ అమ్మకాలు చేపడితే 9 కోట్ల రూపాయల వరకు ఆదాయం లభిస్తుందని, సంక్రాంతిలోగా బకాయిలు కొంతమేరైనా చెల్లించడం ద్వారా రైతులు, కార్మికుల కళ్లల్లో ఆనందాన్ని నింపాలన్నారు. లేకుంటే కాటాల వద్ద దశలవారీగా ఆందోళన తప్పదని హెచ్చరించారు.కార్యక్రమంలో సిడిసి మాజీ చైర్మన్ ఏడువాక సత్యారావు, జెడ్‌పిటిసి మారిశెట్టి విజయ శ్రీకాంత్, బొడ్డేడ సూర్యనారాయణ పాల్గొన్నారు.

వెటరన్ క్రీడాకారిణికి ఆర్థిక సాయం

లక్ష్మికి నగదు సాయం అందజేస్తున్న సద్భావన బృందం సభ్యులు

ప్రజాశక్తి -చోడవరం : రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తాచాటి, జాతీయ పోటీలకు ఎంపికైన వెటరన్ క్రీడాకారిణికి ముత్యం లక్ష్మికు సద్భావన బృందం సభ్యులు ఆదివారం చోడవరంలో రూ.18,600 ఆర్థికసాయం చేశారు. ఈ నెల 31, ఫిబ్రవరి 1,2 తేదీలలో కేరళలో జరిగే జాతీయస్థాయి వెటరన్ ఆటల పోటీలలో పాల్గొనేందుకు అర్హత సాధించిన లక్ష్మి, అక్కడకు వెళ్లేందుకు రవాణాఖర్చులుగా తమవంతు సాయాన్ని అందించారు. నరసయ్యపేట సర్పంచ్ ఉగ్గిన నాగబాబు, సబ్ రిజిస్ట్రార్లు మోహనరావు, నారాయణరావు చెరో రూ.అయిదు వేలు ఇవ్వగా, మిగతా నగదును సభ్యులు సమకూర్చారు. కార్యక్రమంలో సద్భావన బృందం సభ్యులు సబ్ రిజిస్ట్రార్ గీతా లక్ష్మి, కె. చలపతి, కొప్పాక రాజేష్, పిఎస్ఎన్ మూర్తి, ఉప్పల రజిని, సూర్య కుమారి, ఎం రమేష్ పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం

గవరపాలెం మున్సిపల్ హైస్కూల్ పూర్వ విద్యార్థులు

సబ్బవరం ప్రభుత్వ పాఠశాల పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి - అనకాపల్లి : గవరపాలెం మున్సిపల్ హైస్కూల్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం ఆదివారం పాఠశాల ఆవరణలో ఘనంగా జరిగింది. 1952 నుంచి ఇదే పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులంతా పాల్గొన్నారు. విశాఖపట్నం గౌరీ సేవా సంఘం అధ్యక్షులు బుద్ద శివాజీ మాట్లాడుతూ 50 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులు కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. పూర్వ విద్యార్థుల సంఘ నాయకుడు లీడర్ పత్రిక ఎడిటర్ వివి రమణమూర్తి మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి ఎల్లవేళలా కట్టుబడివుందామని పిలుపునిచ్చారు. ఏటా జనవరి నెలలో క్రమం తప్పకుండా పూర్వ విద్యార్థులంతా కలుసుకుందామన్నారు. పూర్వ ఉపాధ్యాయులందరినీ సత్కరించారు. ఆటపాటలతో ఆనందోత్సాహాలతో సందడిగా గడిపారు. కార్యక్రమంలో బొడ్డేడ అప్పారావు, పి ఎస్ అప్పారావు, దాడి శివరామకృష్ణ, కెఎన్‌వి సత్యనారా యణ, భల్లా నాగభూషణం, విశ్రాంత ప్రిన్సిపాల్ విల్లూరి అప్పల స్వామి నాయుడు, బుద్ద అప్పారావు, శరగడం శ్రీరామ చంద్రమూర్తి, విశ్రాంత డిడి అప్పల భక్తుల నాగేశ్వరరావు పాల్గొన్నారు. 80 ఏళ్ల దాటిన వారిని సత్కరించారు.

చోడవరం:మండలంలో పిఎస్.పేట ఎంపియుపి పాఠశాల 1988-89 ఏడవ తరగతి బ్యాచ్ పూర్వమిత్రులు ఆదివారం అద్దూరు మజ్జి గౌరమ్మ ఆలయం వద్ద ఆత్మీయ సమావేశం నిర్వహించారు. అలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. సహపంక్తి భోజనాలు చేశారు. తమ బ్యాచ్ మిత్రుల కష్టసుఖాల్లో పాలు పంచుకోవాలని నిర్ణయించుకున్నారు. చవితిని బాబూరావు, ఆనంత పల్లి శీను, డిఎన్. మూర్తి, రేవతి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

పిఎస్.పేట పూర్వ విద్యార్థుల సమ్మేళనం

సబ్బవరం : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1990-91 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం హైస్కూల్ ఆవరణలో కలుసుకున్నారు. 34 ఏళ్ల తర్వాత ఎక్కడెక్కడో స్థిరపడిన పూర్వ విద్యార్థులంతా వచ్చి, పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నార విందు, వినోదాలతో సందడి చేశారు.అప్పట్లో చదువు చెప్పిన గురువులు నరసింహామూర్తి, జంగమయ్య ,సింహాద్రిప్రసాద్, చిన సూర్య నారాయణ, బయాలజీ టీచర్ సరస్వతిని సత్కరించారు.

మోడీ సభను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- సబ్బవరం : ఈ నెల 8న విశాఖలో ప్రధాని నరేంద్ర మోడీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎంపిపి బోకం సూర్య కుమారి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ప్రజా ప్రతినిధులు, అధికారులతో సమావేశమై చర్చించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పద్మజ, ఎఒ శివరామప్రసాద్ నారాయణ, ఇఒపిఆర్‌డి చైతన్య, పలువురు కార్యదర్శులు, విఆర్ఒలు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన మోడల్ టెస్ట్

భారీ సంఖ్యలో హాజరైన టెన్త్ విద్యార్థులు

టెన్త్ మోడల్ పరీక్ష పేపర్లను ఆవిష్కరిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ప్రజాశక్తి - యలమంచిలి: యలమంచిలి కొత్తపేట హైస్కూల్‌లో ఆదివారం ఎస్‌ఎఫ్‌ఐ అనకాపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు మోడల్ టెస్ట్ నిర్వహించారు. యలమంచిలి పట్టణం, రూరల్ మండలంలోని14 హైస్కూళ్ల నుండి 700 మంది విద్యార్థులతోపాటు చైతన్య పాఠశాల నుంచి మరో 120 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ ప్రతినిధులు మాట్లాడుతూ, పబ్లిక్ పరీక్షలంటే టెన్త్ విద్యార్థుల్లో భయం పోగొట్టి, ఆత్మవిశ్వాసం పెంచడం, పరీక్ష నమూనాపై అవగాహనకు ఈ పరీక్ష దోహదపడుతుందన్నారు. పరీక్ష ముగిసిన తర్వాత జవాబుపత్రాలను అనకాపల్లి ఎస్‌ఎఫ్‌ఐ కార్యాలయానికి తరలించి, వారం రోజుల్లో మూల్యాంకన తర్వాత ఫలితాలను వెల్లడిస్తామన్నారు. దీని ఆధారంగా విద్యార్థులు తమ ప్రతిభపై అంచనాకు రావొచ్చని, తద్వారా లోపాలను సరిదిద్దుకుని ప్రధాన పరీక్షకు సన్నద్ధతకు అవకాశం ఉంటుందన్నారు.ఉపాధ్యాయిని ఎం . సుధారాణి మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ. జిల్లా అధ్యక్షులు ఎం.బాలాజీ, మండల అధ్యక్ష, కార్యదర్శులు అభి, మణికంఠ, డివిజన్ నాయకులు రామలక్ష్మణులు, శ్రీను, కృప, రాఘవేంద్ర, సునీల్, ధర్మరాజు, రాజేష్, శరణ్య, జాను, హేమ, సత్య పాల్గొన్నారు. పీజీ, బిఇడి విద్యార్థులు ఇన్విజిలేటర్లుగా వ్యవహరించారు.

50 మంది రక్తదానం

రక్త దాతలతో సర్పంచ్ జయ, నిర్వాహకులు

ప్రజాశక్తి- కశింకోట : మండలంలోని బయ్యవరం సన్నీ యూత్ క్లబ్ భవనం స్థానిక స్వామి వివేకానంద యూత్ ఆధ్వర్యంలో ఆదివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఆరిలోవ చత్రపతి శివాజీ వాలంటరీ బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 50 మంది రక్తదానం చేశారు. స్వామి వివేకానంద యూత్ ఆధ్వర్యంలో ఎనిమిదేళ్లుగా దిగ్విజయంగా రక్తదాన శిబిరాలు నిర్వహించడంపై పలువురు అభినందించారు. గ్రామ సర్పంచ్ గొల్లవిల్లి జయ శ్రీనివాసరావు, చిదిరెడ్డి ప్రసాద్, బలిజి చంటి, నిర్వాహకులు కొరుప్రోలు వెంకటేశ్వరరావు మాస్టారు, డిసిసిబి మేనేజర్ లంక దుర్గాప్రసాద్, ఆదర్శ, విశ్వభారతి పాఠశాలల కరస్పాండెంట్లు దేవర చిరంజీవి, గొన్నాబత్తుల నానాజీ, బ్రహ్మకుమారిస్ అనకాపల్లి శాఖ జగతా భూపతి, సనేడ గజాలు, పాతాళ శ్రీకాంత్, కొల్లి సంతోష్, కోటి హరి, సన్నీ యూత్ క్లబ్ అధ్యక్షులు అగ్గాల శ్రీను పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన

బ్రాండిక్స్ ఆధ్వర్యాన ఉచిత కంటి పరీక్షలు

ప్రజాశక్తి- అచ్యుతాపురం :బ్రాండ్ ఎక్స్ ఇండియా అపెరల్ సిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 134 ఉచిత కంటి వైద్య శిబిరంలో 330 మంది కంటి రోగులకు నేత్ర వైద్యనిపుణులు పరీక్షలు చేశారు వీరిలో 242 మందికి ఉచిత అద్దాలను అందించి 144 మందికి మందులు పంపిణీ చేశారు. 20 మందికి ఆపరేషన్‌కు ఎంపిక చేశారు. శిబిరంలో పాల్గొన్న రోగులు, సహాయకులకు మజ్జిగ, భోజనం అందించారు.

సబ్బవరం: మండలంలోని గుల్లేపల్లిలోని అక్షర ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో అనకాపల్లి జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. అక్షర స్కూల్ ప్రిన్సిపాల్ బోకం అప్పారావు ఏర్పాటు చేసినకంటి వైద్య శిభిరాన్ని ఆర్ఇసిఎస్ మాజీ డైరెక్టర్ బోకం రామునాయుడు, మండల సర్పంచ్‌ల అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెండ్ బండారు శ్రీనివాసరావు ప్రారంభించారు. శిబిరంలో 83 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, 17మందిని ఆపరేషన్‌కు ఎంపిక చేశారు.కార్యక్రమంలో ఉప సర్పంచ్ గజ్జి దేముడుబాబు పాల్గొన్నారు.

కస్పా పిల్ల కాలువల పూడిక తీయాలి

ప్రజాశక్తి-వడ్డాది : వడ్డాది కస్పా కాలువకు అనుసంధానంగా ఉన్న పిల్ల కాలువలలో పూడికతీత పనులు చేపట్టాలని జనసేన నాయకులు దొండా సన్యాసిరావు కోరారు. ఆదివారం ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజును కలిసి వినతిపత్రం అందించారు ఈ సందర్భంగా సన్యాసిరావు మాట్లాడుతూ, ఏటా కస్పా ప్రధాన కాలువ పూడికలు మాత్రమే తీస్తున్నారని పిల్ల కాలువలను పట్టించుకోవడం లేదన్నారు. దీంతో వీటి పరిధిలోని వందలాది ఎకరాల ఆయకట్టుకు పూర్తిసామర్థ్యంతో సాగునీరు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నీటిమోటార్లు పెట్టి పొలాలకు సాగునీరు అందించాల్సి వస్తోందన్నారు. మరోవైపు సాగునీరు సాఫీగా ప్రవహించకపోవడంతో రెండోపంట సాగు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. పిల్ల కాలువలు పూడిక తీస్తే రైతులు రెండో పంట వేసే అవకాశాలు ఉంటాయని, ఆ దిశగా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ కోరుకొండ రామలక్ష్మి సూరప్పారావు, ఉప సర్పంచ్ దాడి సూర్య నాగేశ్వరరావు, కస్పా నీటి సంఘం అధ్యక్షుడు దాడి పెదగోవింద, పాల్గొన్నారు .

తుమ్మపాల సుగర్స్‌ను పునరుద్ధరించాలి

• ఎమ్మెల్యే కొణతాల ప్రకటన వెనక్కు తీసుకోవాలి: సుగర్స్ పరిరక్షణ సమితి

మాట్లాడుతున్న కర్రి అప్పారావు

ప్రజాశక్తి -అనకాపల్లి :తుమ్మపాల వివి.రమణ సుగర్స్‌పై ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ చేసిన ప్రకటనను వెనక్కు తీసుకోవాలని సుగర్స్ పరిరక్షణ సమితి ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఆదివారం కనిశెట్టి సురేష్ బాబు అధ్యక్షతన కోడుగంటి గోవిందరావు భవనంలో సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విల్లూరి పైడారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీ తెరిపిస్తామని హామీ ఇచ్చి, ఇపుడు వేరే కార్యక్రమాలు చేస్తామని ఎమ్మెల్యే కొణతాల ప్రకటన చేయడం రైతుల మనోభావాలను దెబ్బతీయడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. 13 వేల మంది సభ్యరైతులు, షేర్‌హోల్డర్స్, అభిప్రాయం తీసుకోకుండా, మహాజనసభ నిర్వహించ కుండా ఇలా ప్రకటన చేయడం విడ్డూరంగా ఉందన్నారు. సుమారు రూ.500 కోట్ల సుగర్ ఫ్యాక్టరీ ఆస్తులు కాజేయడానికే కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు.

కర్రి అప్పారావు మాట్లాడుతూ చెరకు లేని కారణంగా వేరే పరిశ్రమలను స్థాపిస్తామని కొణతాల చెప్పడం హాస్యాస్పదమన్నారు. దీనిపై స్పష్టమైన హామీ ఇస్తే ఆరు మాసాలలో 2 లక్షల టన్నుల చెరకును అందుబాటులోకి తెస్తామన్నారు.కోరిబిల్లి శంకర్రావు మాట్లాడుతూ డిస్టలరి, మిడిషన్, పినాయల్ వంటి ఉప ఉత్పత్తులతో తుమ్మపాల సుగర్స్ విజయవంతంగా నడిచిందని, అదే సామర్థ్యంతో ఫ్యాక్టరీని పునర్వైభవంలోకి తేవాలన్నారు. కనిశెట్టి సురేష్ బాబు మాట్లాడుతూ గతంవైసిపి ప్రభుత్వం తుమ్మపాల సుగర్స్ లిక్విడేషన్‌కు జిఒ ఇస్తే, రైతులు, కార్మికులతో కలిసి అభ్యంతరంవ్యక్తం చేసిన టిడిపి ప్రభుత్వం, ఇపుడు అదేబాటలో సాగడం దురదృష్టకరమన్నారు. తుమ్మపాల సుగర్స్ అభివృద్ధికి గతంలో కృషిచేసిన ఎమ్మెల్యే కొణతాల, ఇచ్చిన మాటను నిలబెట్టుకుని, ఫ్యాక్టరీని ఆధునికీకరించి, తెరిపించాలన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న నారాయణరావు

ప్రజాశక్తి -అనకాపల్లి :మండలంలోని మామిడిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు పౌర్ణమి సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ కెకెవిఎ.నారాయణరావు, వ్యాపారవేత్త కర్రి సన్యాసినాయుడు స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని పరీక్షల్లో మంచి ప్రగతి సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలన్నారు. పౌర్ణమి సేవ సంస్థ ద్వారా 20 ఏళ్లుగా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉచిత పాలిటెక్నిక్ శిక్షణ అందిస్తున్నామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సేవా సంస్థ సభ్యులు బుద్ధ సోమేశ్వరరావు, బొడ్డేడ కాశి, మొల్లి నాగేశ్వరరావు, కర్రి త్రినాధరావు ఆడారి శివాజీ, కర్రి శివ స్వాతి దంపతులు పాల్గొన్నారు.

కూలిన రక్షణగోడతో ఇక్కట్లు

• ప్రమాదభరితంగా మారిన సిసి రోడ్డు

రక్షణగోడ కూలడంతో అంచుల్లో కోతకు గురైన సిసి రోడ్డు

ప్రజాశక్తి- వడ్డాది : వడ్డాదిలో దొరబాబు కాలనీకి వెళ్లే మార్గంలో కాలువ పక్కన ఉన్న సిమెంట్ రోడ్డు కోతకు గురవుతోంది. కాలనీలో డ్రైనేజీల నుంచి వచ్చే నీరంతా ఈ కాలువ ద్వారానే ప్రవహిస్తుంది. గతంలో రోడ్డు పక్కన రక్షణగోడ ఉండేది.నీటి ప్రవాహానికి ఆ గోడ కూలిపోవడంతో రోడ్డు అంచుల్లో నీరు ప్రవహించడంతో కోతకు గురవుతోంది. ఇదే రోడ్డు గుండా ఉదయం నుండి రాత్రి వరకు అనేక మంది రాకపోకలు సాగిస్తుంటారు. వర్షాలకు రక్షణగోడకూలి, రోడ్డు అంచుల్లో కోతకు గురికావడంతో రోడ్డంతా ఇరుకుగా మారి, వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడే పరిస్థితి ఉంది. ఏమాత్రం అజాగ్రత్తగా వాహనాలు నడిపినా, అదుపుతప్పి 15 అడుగులు కిందకి పడిపోయే ప్రమాదం ఉందని స్థానికులు భయాందోళనలు చెందుతున్నారు. అధికారులు స్పందించి, సిమెంట్ రోడ్డుకు రక్షణ గోడ నిర్మించాలని టౌన్ టిడిపి అధ్యక్షుడు దొండా నరేష్ ,తలారి శంకర్ తదితరులు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

కుల జనగణనతో బిసిల అభివృద్ధి

మాట్లాడుతున్న పూర్ణచంద్రరావు

ప్రజాశక్తి- అనకాపల్లి :కుల జనగణన ద్వారానే బిసిల అభివృద్ధి సాధ్యమవుతుందని బిసి కులాల సమన్వయ కమిటీ రాష్ర్ట చైర్మన్ అంగడాల పూర్ణచంద్రరావు అన్నారు. రాజ్యాంగం రిజర్వేషన్లు పూర్తిస్థాయిలో దక్కాలంటే బిసి కుల జన గణనకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని పిలుపునిచ్చారు ఆదివారం కోడుగంటి గోవిందరావు భవన్‌లో బిఎస్‌పి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరణం తిరుపతిరావు అధ్యక్షతన బిసి కులాల ప్రతినిధుల సమావేశంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాజీ ఎమ్మెల్యే లకే రాజారావు మాట్లాడుతూ, బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీలు ఏకమై పోరాటం చేస్తే బహుజనులకు రాజ్యాధికారం సాధ్యమౌతుందన్నారు. బిసి కులాలలో ఐక్యత లేకపోవడం వల్లే రాజ్యాధికారంలో వారి వాటా దక్కటం లేదన్నారు.బిసి కులాల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఆర్‌సి రమణ, రాష్ట్ర కోకన్వీనర్ కె.శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ హక్కుల సాధనకు బిసిలు ఐక్యపోరాటం చేయాలన్నారు.

బిఎస్‌పి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరణం తిరుపతిరావు మాట్లాడుతూ బిసికులాల సమన్వయ కమిటీ గ్రామ మండల జిల్లా కమిటీలను త్వరలోనే నియామకం చేపట్టి భవిష్యత్తు ఉద్యమాలకు శ్రీకారం చుడతామన్నారు. సమావేశంలో బిసి ప్రజా సంఘాల నేతలు గుడాల సత్యనారాయణ ముదిరాజ్, బొట్టా చిన్ని యాదవ్, కోన లక్ష్మణ్, బొడ్డేడ అప్పారావు, ఆళ్ల ప్రవీణ్ కుమార్, బొబ్బిలి గోవిందరాజులు, వాసుపల్లి తాతయ్యలు, ఎస్‌వివి రామచంద్రరావు, కె సత్తిబాబు, ఎం. సూరిబాబు, బిఎస్పీ నేత సూదికొండ మాణిక్యాలరావు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-సబ్బవరం. : కేన్సర్‌తో బాధపడుతూ, వైద్యానికి ఆర్థిక ఇబ్బందులు పడుతున్న మేజర్ పంచాయతీ సబ్బవరం, జోడుగుళ్ళు గ్రామానికి చెందిన అదపరెడ్డి రావయ్యమ్మకు బంగారమ్మ తల్లి భక్త బృందం అధ్యక్షులు సింగంపల్లి వెంకట్రావు, సభ్యులు ఆదివారం బాధితురాలికి రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అలాగే ఇటీవల కేన్సర్‌తో మరణించిన జోడుగుళ్ళు గ్రామానికి చెందిన బండారు రమణ కుటుంబానికి రూ. 10వేల సహాయం అందజేశారు. బంగారమ్మ తల్లి భక్త బృందానికి బాధిత కుటుంబాలు కృతజ్ఞతలు తెలియజేశారు. గ్రామస్తులు అభినందించారు.

అంగన్వాడీ చిన్నారులకు పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి-సబ్బవరం: మండలంలోని పైడివాడ అంగన్వాడీ కేంద్రంలో ఫ్రీ స్కూల్‌డే నిర్వహించారు.. ఈ సందర్భంగా ప్రదర్శించిన సృజనాత్మక కార్నర్, గణిత కార్నర్, మేధాశక్తి, భౌతిక వికాసం కార్నర్, శారీరక, భాషా వికాసం కార్నర్‌లను సర్పంచ్ వడ్డాది అప్పలరాజు పరిశీలించి చిన్నారులకు పుస్తకాలను చేసారు. ఫ్రీ స్కూల్ చిన్నారులకు పాటలు పాడించారు. ఇంగ్లీష్ అక్షరమాల చదివించారు అంగన్వాడీ వర్కర్ వివి. రమణమ్మ, మహిళా పోలీస్ రేణుక, ఉపాధ్యాయులు మాధురి, విఒఎ పి.లక్ష్మి, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

ముమ్మరంగా రోడ్లు, కల్వర్టుల పనులు

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: నియోజకవర్గంలో గోతుల రహదారుల మరమ్మతు పనులు ముమ్మరంగా చేపడుతున్నారు. శాసన సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు చొరవతో ఈ పనులు సాగుతున్నాయి. నర్సీపట్నం -కృష్ణదేవి పేట రోడ్డు, నర్సీపట్నం -చింతపల్లి రోడ్డు, నర్సీపట్నం - అడ్డురోడ్డు వైపు రోడ్లు పై పడిన గుంతలను, ధ్వంసమైన కల్వర్టులను మరమ్మతు చేపడుతున్నారు.

ప్రస్తుతం నియోజవర్గంలో రూ.41 లక్షలతో 18 రోడ్ల పనులు చేపడుతున్నారు. రెండో విడత రూ.43 లక్షలు, మూడో విడత మరో ఆరు రూ.109 లక్షలు మంజూరు అయ్యాయి ఈ పనులకు టెండర్లు పూర్తి చేశారు. శివపురం వద్ద సింగ్ డాక్టర్ ఆసుపత్రి, ఫారెస్ట్ కార్యాలయం రోడ్డు కల్వర్టు అభివృద్ధికి రూ.15 లక్షలు, స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఇంటి సమీపంలోని కల్వర్టు నిర్మాణానికి రూ.55 లక్షలు మంజూరయ్యాయి. ఈ రెండు కల్వర్టు పనులకు టెండరు ప్రక్రియ పూర్తి చేశారు. దీంతో ఆర్అండ్‌బీ అధికారులు పనులు మొదలు పెట్టారు. నర్సీపట్నం- దేవీపట్నం రోడ్డులో రూ.10 లక్షలతో స్పీకర్ అయ్యన్న పాత్రుడు ఇంటి సమీపంలోని గుంతలు పూడ్చి తారు వేశారు. నర్సీపట్నం ఎక్సైజ్ కార్యాలయం దాటిన తర్వాత రూ.4 లక్షలతో మరమ్మతు పనులు పూర్తి చేశారు. పెదబొడ్డేపల్లి నుంచి నర్సీపట్నం అబీద్ సెంటర్ వరకు రూ.10 లక్షలతో రోడ్డు గుంతలు పూడ్చివేత పనులు చేపట్టారు. నర్సీపట్నం లారీ యార్డు నుంచి బలిఘట్టం బయపురెడ్డిపాలెం వరకు రూ.10 లక్షలతో రోడ్డు మరమ్మతు పనులు చేశారు. గొలుగొండ మండలం కసిమిలో రెండు వర్కులకు రూ.7 లక్షలు, నాతవరం పీహెచ్‌సీ వద్ద రోడ్డు మరమ్మతు పనులకు రూ.10 లక్షలతో చురుగ్గా చేపడుతున్నారు.

శివపురం వద్ద చేపడుతున్న కల్వర్టు పనులు

మాకవరపాలెం మండలంలో కొండల అగ్రహారం నుంచి రోలుగుంటకు వెళ్లే రోడ్డు మరమ్మతులకు రూ.8 లక్షలు మంజూరయ్యాయి.

తిరువీధి సేవ నిర్వహిస్తున్న అర్చకులు

వెంకన్న తిరువీధి సేవ

ప్రజాశక్తి- నక్కపల్లి: ఉపమాక వెంకన్న ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయ అర్చకులు ప్రసాదాచార్యులు, కృష్ణమాచార్యులు, శేషాచార్యులు, గోపాలాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుని ఉత్సవమూర్తులను తిరువీధి సేవ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తుల తరలివచ్చి స్వామి దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు పింఛన్ల పరిశీలన

ప్రజాశక్తి -రావికమతం: మండలంలోని పలు గ్రామాలలో మెడికల్ పెన్షన్ పొందుతున్న లబ్ధిదారులను ఈనెల 6న వెరిఫికేషన్ చేయడం జరుగుతుందని ఎంపీడీవో వెంకన్న బాబు తెలిపారు .ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, మండలంలో 17 మెడికల్ పెన్షన్లు ఉన్నట్లు గుర్తించామన్నారు. మెడికల్ అధికారులు ధ్రువపత్రాలను పరిశీలిస్తారన్నారు. చాలామంది తప్పుడు దృవపత్రాలతో మెడికల్ పెన్షన్లు పొందుతున్నట్లు పలు ఆరోపణలు వస్తున్న మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకొందన్నారు. అటువంటి పెన్షన్లు అన్నింటినీ పరిశీలన చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. విచారణ అధికారులకు లబ్ధిదారులు, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు సహకరించాలని ఆయన కోరారు.

ఆందోళన చేపడుతున్న బిజెపి నేతలు

వేరొకరికి పదవిపై..

బిజెపి నేతల ఆందోళన

ప్రజాశక్తి-గొలుగొండ: బీజేపీ మండల అధ్యక్షుడిగా గౌరీనాయుడుకు పదవి ఇవ్వడంపై గొలుగొండ మండలం కొంగసింగిలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఆందోళన బాట పట్టారు. ఎటువంటి సమాచారం ఇవ్వకుండా విజయనగరం నుంచి వచ్చిన వ్యక్తికి పదవీ ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. స్థానికంగా ఉండే వారికి ఈ పదవి ఇవ్వకపోతే ఏకపక్షంగా రాజీనామా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దంట్ల బాబ్జి, అల్లు నూకరాజు, పైల సత్యారాంప్రసాద్, కొర్రాయి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం మారినా..

దళితులు, మహిళలపై తగ్గని అఘాయిత్యాలు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: రాష్ట్రంలో ప్రభుత్వం అవలంబిస్తున్న విధానంలో మార్పు రావాలని, దళితులపై దాడులు, హత్యలు, మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలు జరుగుతున్నాయని భారత చైతన్య యువజన (బీసీ వై)పార్టీ జాతీయ అధ్యక్షులు బోడె రామచంద్ర యాదవ్ అన్నారు. నర్సీపట్నం సిటీ క్లబ్లో ఆదివారం యాదవ సంఘం నాయకులు ఒమ్మి నరసింగరావు (వంశీ మాస్టర్) సభాధ్యక్షతన జరిగిన బహుజన పోరాట సభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తప్పు చేసిన వారిపై కేసులు పెట్టకుండా పోలీస్ వ్యవస్థ పై ఒత్తిడి తేవడం సరికాదన్నారు. పోలీసులకు స్వేచ్ఛనిస్తే రాష్ట్రంలో నేరాల సంఖ్య తగ్గుముఖం పడుతుందన్నారు. పోలీసులు కేసులు విషయంలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలన్నారు. అలా జరిగినప్పుడే రాష్ట్రంలో నేరాలు అదుపులోకి వస్తాయన్నారు. ప్రభుత్వాలు మారినా పరిపాలన మారలేదని, రాష్ట్రంలో వెనుకబడిన వర్గాలు, దళితులపై

మాట్లాడుతూన్న రామచంద్ర యాదవ్

దాడులు తగ్గడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత 6 నెలల కాలంలో 150 పైగా మహిళలపై అత్యాచారాలు, సామాన్యులపై దాడులు జరిగితే ప్రభుత్వం ఇప్పటివరకు చర్యలు తీసుకున్న దాఖలాలు కనబడలేదన్నారు. సమావేశంలో బిసివై నాయకులు నమ్మి అప్పలరాజు,సుధాకర్ యాదవ్, దేవర అనూష, మిడియం బాబురావు, హరి యాదవ్, నియోజకవర్గ ఇంచార్జ్ జోగా చంద్రమౌళి, యాదవ హక్కుల సమితి నాయకులు ఇసరపు శేఖర్, పాల రమేష్, వియ్యపు భూలోక నాయుడు పాల్గొన్నారు.

సంతలో నాటు కోళ్లకు గిరాకీ

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట: సంక్రాంతి పండుగ దగ్గర పడుతుండటంతో వారపు సంతల్లో నాటు కోళ్లకు గిరాకీ పెరిగింది. మండలంలో వడ్డాదిలో ఆదివారం సంతకు భారీగా నాటు కోళ్ల వచ్చాయి. పందెం పుంజులను కూడా పెద్ద సంఖ్యలో అమ్మకానికి తెచ్చారు. ఒక్కో కోడి ధర రూ.వెయ్యి నుంచి 6 వేలు వరకు పలికింది. నాటు కోళ్ల కోసం పట్టణ ప్రాంతాల నుంచి వచ్చారు. పండుగ దగ్గర పడే కొద్దీ కోళ్లకు మరింత గిరాకీ పెరగనుంది. దీంతో కొంతమంది ముందుగానే కోళ్లను కొనుగోలు చేస్తున్నారు.

సంతకు తీసుకొచ్చిన కోళ్లు

మన్యంలో పర్యాటకుల సందడి

అరకులోయలో పర్యాటకుల తాకిడి

ప్రజాశక్తి-అరకులోయ: పర్యాటక కేంద్రమైన అరకు లోయలో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. మునుపెన్నడు లేని విధంగా గత నెల రోజులుగా పర్యాటకులు వేల సంఖ్యలో తరలి వస్తున్నారు. జనవరి మొదటి వారం నుంచి పర్యాటకుల సంఖ్య క్రమంగా తగ్గుతుందని అందరు భావించినప్పటికీ, ఇప్పటికి పర్యటకుల సంఖ్య ఏమాత్రం కూడా తగ్గుముఖం పట్టలేదు. ఆదివారం కూడా పర్యాటకులు తరలివచ్చారు.దీంతో అరకు ప్రాంతంలోని పర్యాటక సందర్శిత ప్రాంతాలు కిటకిట లడాయి. మరమ్మత్తుల దృష్ట్యా పద్మావతి ఉద్యాన కేంద్రం ఈనెల మూడు నుంచి 11 వరకు మూసి వేస్తున్నట్లు పాడేరు ఐటీడీఏ పీవో ప్రకటించినప్పటికీ, వందల సంఖ్యలో ప్రతిరోజు తరలివచ్చి నిరాశతో వెను తిరుగుతున్నారు. దీంతో అరకులో గిరిజన సంస్కృతిక మ్యూజియం, కాఫీ మ్యూజియం చాక్లెట్ ఫ్యాక్టరీ కిటకిటలాడుతున్నాయి.

డుంబ్రిగుడ: మండలంలో పర్యాటక ప్రదేశాలైన చాపరాయి జలపాతంలో సుమారు గత ఐదు, ఆరు వారాల బట్టి పర్యాటకుల తాకిడి తగ్గడం లేదు. అధిక సంఖ్యలో పర్యాటకులు తరలి వస్తుండడంతో పర్యాటక ప్రాంతాలు కిటకిటలాడుతున్నాయి. చాపరాయి జలపాతంలో సరదాగా జారుకుంటూ స్నానాలు చేస్తూ పర్యాటకులు ఆనందంగా గడిపారు. అరకు పినారిలోని అందమైన ఎత్తయిన చెట్లు మధ్యన ఫోటోలు తీయించుకుంటూ పర్యాటకులు సందడి చేశారు. ఆదివారం చాపరై జలపాతం లో అధిక సంఖ్యలో వాహనాలు రావడంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. రోడ్డుకి ఇరువైపులా అడుగడుగునా వంటలు చేసి వన బోజనాలు చేస్తూ ఆటపాటలతో పర్యాటకులు సందడి చేశారు.

బాక్సింగ్ పోటీలను ప్రారంభిస్తున్న కోచ్

ఉత్సాహంగా పోటీలు

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో నెహ్రూ యువ కేంద్రం (విశాఖపట్నం) ఆధ్వర్యంలో ఆదివారం క్లస్టర్ అఫ్ బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్‌లో భాగంగా పోటీలు నిర్వహించారు. వాలీబాల్ ప్రథమ బహుమతి నర్సీపట్నం క్రీడాకారులు, షాట్ పుట్‌లో పెదబొడ్డేపల్లి డాన్ బాస్కోస్ కాలేజ్‌కీ చెందిన శశి కుమార్, మహిళలలో ప్రథమ బహుమతి కె జాహ్నవి రిషి కాలేజ్, నర్సీపట్నం బాక్సింగ్‌లో ప్రథమ బహుమతిలు కుంచా మొక్షిత్ 65 కేజీలు, ప్రవీన్ 60 కేజీలు, జగదీష్ 40 కేజీలు, బాలికలు గండి జ్యోతి 45 కేజీ, లాస్య 40 కేజీ ఉషులో పెబొడ్డేపల్లి నేషనల్ స్పోర్ట్స్ అకాడమీ వుషు క్రీడాకారులు గెలుపొందారు. గెలుపొందిన క్రీడాకారులకు మెడల్స్, ట్రోఫీలు బహుకరించారు. ఈ కార్యక్రమాన్ని ఎన్‌వైకే, నింజాస్ అకాడమీ, స్పోర్ట్స్ అథారిటీ (అనకాపల్లి) ఆధ్వర్యంలో నిర్వహించారని శాప్ కోచ్ అబ్బు తెలిపారు.ఈ కార్యక్రమంలో సీనియర్ కోచ్ శేఖర్, ప్రియాంక పాల్గొనారు.

పనులు ప్రారంభిస్తున్న జనార్ధన్

అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి -కోటవురట్ల: కూటమి ప్రభుత్వంతోనే గ్రామీణ ప్రాంతాలలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని మండల టిడిపి సీనియర్ నాయకులు వేచలపు జనార్ధన్ అన్నారు. పాములవాక గ్రామ పరిసర ప్రాంతాల్లో 17 లక్షల తో వివిధ అభివృద్ధి పనులను ఆదివార ప్రారంభించారు. పాములవాక, భీమబోయినపాలెం, కన్నూరుపాలెం, సుర్లవానిపాలెం గ్రామాలలో రెండవ విడతలో మంజూరైన అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి టిడిపి తోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

బంతిపూల తోట

బంతిపూల సాగుపై మక్కువ

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : ఏజెన్సీ ప్రాంతాలకే పరిమితమైన బంతిపూల సాగు మైదాన గ్రామీణ ప్రాంతాలకు కూడా విస్తరించింది. బుచ్చయ్యపేట మండలంలోని ఆర్.భీమవరంలో గ్రామంలో పలువురు రైతులు బంతిపూలను సాగు చేస్తున్నారు. బంతిపూలకు మంచి డిమాండ్ ఉందని రైతులు తెలిపారు. పచ్చని పల్లెల మధ్య వివిధ వర్ణాల బంతిపూల తోటలు ఎంతో ఆకర్షిస్తున్నాయి. పూల తోటల మధ్య సెల్ఫీలు వీడియోలు తీసుకునేందుకు యువత ఆసక్తి చూపుతున్నారు. అలాగే ఈ బంతి పూల తోటల్లో సినిమా షూటింగ్ చేస్తున్నారు.

ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతులు

టమాటా ధర పతనం

-ఆందోళనలో అన్నదాతలు

ప్రజాశక్తి-గొలుగొండ:టమాటా ధర పతనంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కిలో రూ.50 నుంచి రూ.100 వరకు పలికిన ధర, ఇప్పుడు తాము పండించిన పంట చేతికి వచ్చేసరికి కిలో రూ.10కి పడిపోతుందని సాగుదారులు వాపోతున్నారు. కృష్ణదేవిపేట మార్కెట్‌లో సుమారు 30కిలోలు ఉన్న క్రేట్ టమాటాలు రూ.250కి మించి ధర పలకేదు. గొలుగొండ, కొయ్యూరు మండలాలకు సరిహద్దులో ఉన్న కృష్ణదేవిపేట (ఏఎల్.పురం) ప్రధాన వ్యాపారం కేంద్రంగా ఉంది. ఈ రెండు మండలాల్లోని ఏఎల్.పురం, చోద్యం, లింగంపేట, పాడి, రత్నంపేట, కినపర్తి, వల్సంపేట, భీమవరం, పి.మాకవరం, కేడిపేట, నాగాపురం తదితర గ్రామాల్లోని మెట్ట భూముల్లో రబీ పంటగా రైతులు టమాటా, వంగ వంటి కూరగాయ పంటలను సాగు చేస్తుంటారు. సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో టమాటా మొక్కలు నాటిన పొలాల్లో ప్రస్తుతం పంట దిగుబడి వస్తుంది. రైతులు టమాటాలను కేడిపేట తీసుకువచ్చి విక్రయిస్తుంటారు. నర్సీపట్నం తుని ప్రాంతాల నుంచి దళారులు వచ్చి కొనుగోలు చేస్తుంటారు. ధరలు పతనం కావడంతో టమాటా రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

లోకేష్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న తాతయ్యబాబు

లోకేష్‌ను కలిసిన తాతయ్యబాబు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట :టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి లోకేష్‌ను టిడిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ బత్తుల తాతయ్యబాబు ఆదివారం విశాఖలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తాతయ్యబాబును అనకాపల్లి జిల్లాలో టీడీపీ సభ్యత్వ నమోదుపై లోకేష్ అడిగి తెలుసుకున్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో విస్తృత స్థాయిలో టీడీపీ సభ్యత్వ నమోదు చేస్తున్నారని లోకేష్‌కు బత్తుల వివరించారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-చింతపల్లి: వ్యాదుల పట్ల అప్రమత్తంగా ఉండడంతో పాటు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఆర్ బి నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి కే సౌమ్య సూచించారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నివారణ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ల ఆదేశాల మేరకు చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యంలో మండలంలోని అంతర్ల గ్రామంలో మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఆమె ముందుగా 42 మంది రోగులకు రక్త పరీక్షలు, 120 మందికి వైద్య సేవలు అందించారు. వ్యాధి గ్రస్తులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లింక్ వర్కర్ స్కీమ్ సూపర్వైజర్ డి.రమణ మాట్లాడుతూ హెచ్.ఐ.వి, సుఖ వ్యాధులు, టీబీ తదితర వ్యాధులపై అవగాహన కల్పించారు. లింక్ వర్కర్ పార్వతి మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఒక్కరూ హెచ్.ఐ.వి ని గురించి తెలుసుకొని రక్త పరీక్షలు చేసుకోవాలని సూచించారు. వైద్యాదికారిణి సౌమ్య మాట్లాడుతూ సీజనల్ వ్యాధులైన మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ వ్యాధులపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

నిర్వాసితులకు ప్యాకేజీ చెల్లించిన తర్వాతే..

బల్క్‌డ్రగ్ పార్కుకు శంకుస్థాపన చేయాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లి మండలంలో బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటుచేసి ప్రజల జీవితాలు నాశనం చేయొద్దని, నిర్వాసితులకు పూర్తిస్థాయిలో ప్యాకేజీలు చెల్లించకుండా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ శంకుస్థాపన ఎలా చేస్తారని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు, వైసిపి నేత వీసం రామకృష్ణ తెలిపారు. మండలంలోని రాజయ్యపేటలో ఆదివారం నిర్వాసితుల సమావేశంలో సిపిఎం నేత అప్పలరాజు, జెడ్పిటిసి సభ్యురాలు గోసల కాసులమ్మ, వైఎస్ఆర్ సిపి సీనియర్ నాయకులు వీసం రామకృష్ణ, తళ్ల భార్గవ్, సూరకాసుల గోవింద్, ఎంపీటీసీ సభ్యులు గంటా తిరుపతిరావు తదితర నాయకులు పాల్గొని మాట్లాడారు. నక్కపల్లి మండలంలో వైజాగ్ - చెన్నై ఇండస్ట్రీయల్ కారిడార్ కోసం రాజయ్యపేట, బుచ్చిరాజు పేట, చందనాడ రెవెన్యూ భూములలో బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు చేయడం కోసం రైతుల సాగులో ఉన్న భూములలో కొబ్బరి, జీడి తోటలను నేలమట్టం చేస్తున్నారన్నారు. ఈనెల 8వ తేదీ బుధవారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విశాఖపట్నం నుండి బల్క్ డ్రగ్ పార్క్‌ను వర్చువల్ గా శంకుస్థాపన చేయడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారని, దీనిని తామంతా తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. 2013 భూసేకరణ చట్ట ప్రకారం భూములు కోల్పోయిన రైతులు, వారిపై ఆధారపడిన కూలీలు, వివిధ వృత్తిదారులు, సముద్రమే జీవనాధారంగా జీవిస్తున్న మత్స్యకారులకు ప్యాకేజీ చెల్లించాలని, ఇల్లులు తొలగిస్తున్నట్టు వంటి కుటుంబాలలో 18 సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరికి 25 లక్షల రూపాయలు ప్యాకేజీ, 5 సెంట్లు స్థలం ఇవ్వాలని, ఇక్కడ ఏర్పాటు చేయబోయే పరిశ్రమల ప్రభావానికి గురి కాబోతున్న, ఉపాధి కోల్పోతున్న మత్స్యకారులు, కళ ృగీత కార్మికులు, రజకులు, క్షౌర వృత్తిదారులు , దళితులు ,కూలీలకు 15 లక్షల రూపాయలు ప్యాకేజీ చెల్లించాలన్నారు. ఇల్లులు కోల్పోతున్న నిర్వాసితులకు పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. 2013 భూసేకరణ చట్ట ప్రకారం, వీటన్నిటిని అమలు చేయవలసి ఉండగా ప్రభుత్వం, అధికారులు చట్టాన్ని ఉల్లంఘించి, రైతుల భూములను కార్పొరేట్లకు ఆగమేఘాలపై అప్పగించడానికి చూస్తోందని విమర్శించారు. కాకినాడ ఎస్ సి జెడ్ లో నిషేధించిన బల్క్ డ్రగ్ పార్కును ఏర్పాటు చేసేందుకు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారన్నారు. బల్క్ డ్రగ్ పార్క్ ఇక్కడ ఏర్పాటు చేస్తే, ఆ కంపెనీ వ్యర్థ రసాయన జలాలు సముద్రంలో కలవడంతో మత్స్య సంపద నశించి మత్స్యకారులకు ఉపాధి లేకుండా పోతుందని తెలిపారు.మత్స్యకారుల జీవన విధానం దెబ్బతీసే విధంగానూ, పొట్ట కొట్టే విధంగా కూటమి ప్రభుత్వం సన్నాహాలు చేస్తుందని దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.ప్రభుత్వం ఇవేమీ పట్టించుకోకుండా సముద్ర తీరాన్ని డంపింగ్ యార్డ్ గా మార్చి ఈ ప్రాంత ప్రజలు అనారోగ్యాల బారిన పడి జీవించే హక్కు లేకుండా ,అవకాశం లేకుండా చేయడం కొరకే బల్క్ డ్రగ్స్ కంపెనీలను ఏర్పాటు చేస్తుందన్నారు. ఈనెల 8వ తేదీన ప్రధానమంత్రి బల్క్ డ్రగ్ పార్క్ శంకుస్థాపన విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎం.రాజేష్, నాయకులు ఎం.మహేష్, పి.సత్యారావు, కే.చిన్న, జి.సోమేశ్వరరావు, కే.కాశీరావు, వై.సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం, వైసిపి నాయకులు, నిర్వాసితులు

విశాఖ ఉక్కును..

సెయిల్‌లో విలీనం చేయాలి

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్:విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరణ చేయడం లేదని, సెయిల్ లో విలీనం చేస్తున్నామని ఈనెల 8 న విశాఖ వస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ ప్రకటించాలని, స్టీల్ ప్లాంట్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు ఓ.వి రావు డిమాండ్ చేశారు. స్టీల్ ప్లాంట్ ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ చేయవద్దని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు ఆదివారం నాటికి 1378వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్ ప్లాంట్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 32 మంది ప్రాణాలు బలిదానంతో విశాఖ ఉక్కు ఆంధ్రులహక్కు అనే నినాదంతో ఏర్పడిందన్నారు. విశాఖ ఉక్కును ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేయనివ్వబోమన్నారు. 4 నెలలుగా కార్మికులకు జీతాలు చెల్లించకుండా, ఆకలి బాధలకు కావాలనే గురి చేస్తున్నా, మొక్కవోని దీక్షతో ఉత్పత్తి పరుగులు తీయిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా మోడీ చేత స్పష్టమైన ప్రకటన చేయించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు జి.శ్రీనివాసరావు, నమ్మి రమణ, ఎన్.కృష్ణ, పి. మసేను, వి.వి రమణ, యు.సోమేష్, పి. నారాయణ, ఎన్.శశిభూషణ్, బి. సూర్యకుమార్, శ్యామ్‌సుందర్, సిహెచ్ రాముడు, బి. అప్పలరాజు, మొల్లి పైడి రాజు తదితరులు పాల్గొన్నారు.

దీక్షలో కూర్చున్న నాయకులు

బొమ్మనలో మహిళలు మెచ్చే చీరలు

చీరలను పరిశీలిస్తున్న మేయర్ హరివెంకట కుమారి

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ:విశాఖపట్నం నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి మద్దిలపాలెంలో ఇటీవల ప్రారంభించిన బొమ్మన బుట్ట బొమ్మ నూతన షోరూం ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 4 దశాబ్దాలుగా వస్త్ర వ్యాపారంలో తెలుగు రాష్ట్రాల ప్రజల మన్నలు అందుకున్న బొమ్మనా బ్రదర్స్ సంస్థ విశాఖ నగరంలో 4వ శాఖను ప్రారంభించడం సంతోషమన్నారు. ఇక్కడ భారతదేశంలోని అన్ని సంస్కృతులకు చెందిన చీరలు అందుబాటులో ఉన్నాయన్నారు. మహిళలు మెచ్చే అన్ని డిజైన్ల చీరలు ఈ షోరూంలో అందుబాటు ధరల్లో లభ్యమవు తున్నాయన్నారు. ప్రజల నుండి ఆదరణ పొందిన వస్త్ర సంస్థ బొమ్మన అని కొనియాడారు. తమ కుటుంబీకులు చిరకాలంగా బొమ్మన లో వస్త్రాలు కొనుగోలు చేయడానికి ఇష్టపడే వారిని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమం లో బొమ్మన సత్యారాజ్ కుమార్ , బొమ్మన సునీత, బొమ్మన మణిరాజ్, యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రాయగడ రైల్వే డివిజన్ భవనానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రధాని మోడీ సోమవారం జమ్మూ వేదికగా దేశ వ్యాప్తంగా పలు రైల్వే ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నట్టు ఈస్ట్ కోస్ట్ రైల్వే అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అందులో ఈస్ట్ కోస్ట్ రైల్వే పరిధిలోని రాయగడ రైల్వే డివిజన్ భవనం ఉందని, దానికి ప్రధాని శంకుస్థాపన చేయనున్నారని వెల్లడించారు. ఒడిశా, ఆంధ్రప్రదేశ్ సమీప ప్రాంతాలలో కనెక్టివిటీని మెరుగుపరిచేందుకు ఈ డివిజన్ తోడ్పడుతుందని తెలిపారు. తెలంగాణలోని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని చర్లపల్లి కొత్త టెర్మినల్ స్టేషన్‌ను సుమారు రూ.413 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేయగా దానిని ప్రధాని ప్రారంభించనున్నారన్నారు. ఆయా కార్యక్రమాలకు అన్ని ఏర్పాట్లూ పూర్తయ్యాయన్నారు.

తెలుగులో

ప్రభుత్వ ఉత్తర్వులు అభినందనీయం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ:రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు ఇకపై తెలుగులోనే వెలువరించాలని తీసుకొన్న నిర్ణయం తెలుగు భాషకు ఎంతో ప్రాచుర్యం కల్పించే దిశగా అడుగులు పడ్డాయని, ఈ విషయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ధన్యవాదములని విఎంఆర్‌డిఎ ఛైర్మన్ ప్రణవ్ గోపాల్ అన్నారు. రాష్ట్రంలో అత్యధిక జనాభా తెలుగులోనే మాట్లాడుకుంటారని ప్రభుత్వ ఉత్తర, ప్రత్యుత్తరాలన్ని కూడా తెలుగులోనే ఉండటం అందరికి సౌలభ్యంగా ఉంటుందని, ఇది ఎంతో హర్షణీయమన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యాన్ని గుర్తించాలి

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ప్రతి విద్యార్థిలో ఏదో అంశంలో నైపుణ్యం ఉంటుందో దానిని గుర్తించి ప్రోత్సహిస్తే భవిష్యత్తు ఉన్నత స్థానానికి ఎదుగుతారని ప్రముఖ ఇంటర్నేషనల్ సైకాలజిస్ట్ ఆశ్లేషా ఈదల పేర్కొన్నారు. ఆదివారం స్థానిక శ్రీ మోదమాంబ హైస్కూల్లో నిర్వహించిన పేరెంట్, టీచర్ మీటింగ్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పిల్లల మానసిక-క్రమశిక్షణ, తల్లిదండ్రులు పిల్లల పట్ల భాధ్యతలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా ప్రస్తుత సమాజంలో దిగజారుతున్న విలువలు, రుగ్మతలను వివరించారు. ప్రస్తుత సమాజంలో విద్యార్థులు ఎలా మెలగాలో తల్లిదండ్రుల బాధ్యతలపై సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ నాగమణి ఘట్టా, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.